
ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శనివారం 14 డిసెంబరు 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కినెలెస్
యాదాద్రి	రూ.127	208	238
సూర్యాపేట	రూ.125	190	210
నల్లగొండ	రూ.130	190	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 28.2 । కనిష్ఠం 21.0

గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు
పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లాలో 87 కేంద్రాల్లో పరీక్ష
- హాజరుకానున్న 29,118 మంది అభ్యర్థులు
- టీజీపీఎస్సీ అనుమతించిన మేరకు స్క్రైబ్స్‌కు అనుమతి
- అభ్యర్థులు ప్రశాంతంగా పరీక్ష రాసేలా ఏర్పాట్లు
- అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్



జిల్లాలో ఈనెల 15, 16 తేదీల్లో గ్రూప్-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నాం.. అభ్యర్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేశాం.. అని అదనపు కలెక్టర్(రెవెన్యూ), గ్రూప్-2 పరీక్షల నోడల్ అధికారి జె.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో గ్రూప్-2 పరీక్షల ఏర్పాట్లు,తదితర విషయాలను ఆయన ఇలా వివరించారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

జిల్లాలో నల్లగొండ, మిర్యాలగూడ పట్టణాల్లోని 87 పరీక్షా కేంద్రాల్లో గ్రూప్-2 నిర్వహిస్తున్నాం. నల్లగొండలో 59, మిర్యాలగూడలో 28 కేంద్రాలు ఏర్పాటు చేశాం. మొత్తం 29,118 మంది అభ్యర్థులు ఈ కేంద్రాల్లో పరీక్ష రాయనున్నారు. నల్లగొండలో 21,777మంది,మిర్యాలగూడలో 7,941 మంది పరీక్షకు హాజరుకానున్నారు. ప్రశ్న పత్రాల కోసం మొత్తం మూడు స్ట్రాంగ్ రూములు ఏర్పాటు చేశాం. పరీక్షల రోజు ఉదయం పోలీసు బందోబస్తు నడుమ పేపర్లను స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి కేంద్రాలకు పంపిస్తాం.

రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనల మేరకు పోలీస్‌శాఖ నుంచి అదనపు ఎస్పీతో కలిసి మేం పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాట్లు, బందోబస్తు, పరీక్షల నిర్వహణపై కార్యాచరణ రూపొందించాం. జిల్లాలో ముగ్గురు రీజనల్ కోఆర్డినేటర్లను నియమించాం. వారితో పాటు 99మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 31 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 17 మంది జాయింట్ రూట్ ఆఫీసర్లు, 31 మంది అబ్జర్వర్లను, 244 మంది ఐడెంటిఫికేషన్ అధికారులను నియమించాం.

కమిషన్ అనుమతి మేరకు జిల్లాలో 82మంది దివ్యాంగ అభ్యర్థులకు ప్రత్యేక సదుపాయాలు అందుబాటులో ఉంచాం.స్క్రైబ్ లేక పరిహార సమయానికి అర్హులని హాల్‌టిక్కెట్‌పై ముద్రించి ఉంటుంది. వారు తప్పనిసరిగా సదరం సర్టిఫికెట్‌ను పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌కు చూపాలి.టీజీపీఎస్సీ అనుమతించినవారికే స్క్రైబ్ నియామకం జరుగుతుంది. వారిని గుర్తించిన తర్వాతే కేంద్రాల్లోకి అనుమతిస్తారు.

ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద పటిష్ఠ పోలీసుబందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. పరీక్షలు జరిగే రెండు రోజులు, నాలుగు సెషన్లలో కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. పరీక్షా కేంద్రాలన్నీ సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణలో ఉంటాయి. కాబట్టి కేంద్రాల వద్ద ఈ రెండు రోజులు పరీక్ష జరిగే సమయంలో విద్యుత్ నిరంతర

- మిగతా 8వ పేజీలో...



ఆదర్శ ఉపాధ్యాయుల
నిరసన బాట

- ఉద్యోగభద్రత కోసం ఆందోళనలు
- జనవరి 4న హైదరాబాద్‌లో మహాధర్నా
- పాఠశాల విద్యాశాఖలో విలీనం చేయాలని డిమాండ్

న్యాయమైన కోర్కెలు తీర్చాలనే డిమాండ్‌తో ఆదర్శపాఠశాలల ఉపాధ్యాయులు దశలవారీగా ఆందోళన నిర్వహిస్తున్నారు. పదేళ్ల క్రితం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ విధానంలో నియమితులైన వీరు ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 194 మోడల్ స్కూళ్లలో 2,900 మంది ఉపాధ్యాయులు వారి హక్కుల కోసం ఉద్యమబాట పట్టారు. పదేళ్ల నుంచి కనీస ఉద్యోగభద్రత లేకుండా కొనసాగుతున్న వీరు ప్రభుత్వం సానుకూలదృక్పథంలో పరిష్కరించాలని కోరుతున్నారు. ప్రభుత్వం స్పందించకుంటే జనవరి 4న హైదరాబాద్‌లో ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్టు ప్రోగ్రెసివ్ మోడల్ స్కూల్స్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

యూపీఏ ప్రభుత్వహయంలో 2012లో మోడల్ స్కూళ్లు ఏర్పాటయ్యాయి. స్కూళ్ల నిర్మాణాలు పూర్తయ్యాక 2013లో నోటిఫికేషన్ ద్వారా ఉపాధ్యాయుల నియామకాలు చేశారు. 2013లో కొందరికి, 2014లో మరి కొందరికి సాంకేతికకారణాలతో వేర్వేరు గా నియామక ఉత్తర్వులు ఇచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 11 ఏళ్లు ఎలాంటి పదోన్నతులు, ఉద్యోగభద్రత లేకుండా మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరితో పాటే అదే సమయంలో ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న సమయం లో ఏపీలో నియమితులైన మోడల్ స్కూల్ టీచర్లను పాఠశాల విద్యాశాఖలో విలీనం చేసి 010 పద్దు కింద వేతనాలిస్తున్నారు. ఇక్కడ కూడా అదే తరహాలో పాఠశాల విద్యాశాఖలో విలీనం చేసి 010 పద్దు కింద వేతనాలివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మోడల్ స్కూల్ టీచర్లుగా ఒకే నోటిఫికేషన్ కింద నియమించినప్పటికీ, రెండోదశలో నియమితులైన వారికి కూడా నోషనల్ సర్వీస్, నోషనల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. హెల్త్‌కార్డులు అందజేయాలని కోరుతున్నారు. వేర్వేరు కారణాలతో ఈ11 ఏళ్ల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 38మంది మృతిచెందగా, వారి స్థానంలో వారి కుటుంబీకులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలివ్వాలని, వారికి సంబంధించిన సీపీఎస్‌డెత్ గ్రాట్యుటీ,ఫ్యామిలీ పింఛన్ వెంటనే అందించాలని డిమాండ్ చేస్తున్నారు. 11 ఏళ్లుగా పదోన్నతులు లేవని, వెంటనే పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని కోరుతున్నారు. పెండింగ్ బకాయిల తక్షణం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు

బోధనకు ఆటంకం కలగకుండా డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా...

- మిగతా 6వ పేజీలో...



హుజూర్‌నగర్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం

● మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



చింతలపాలెంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

మేళ్లచెర్వు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని భారీ నీటిపారుదల శాఖ, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గంలో శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు మంత్రి వచ్చారు. సమయాభావంతో రూ.10కోట్లతో చౌటపల్లి నుంచి మేళ్లచెర్వు వరకు ఏడు కిలోమీటర్ల డబుల్ రోడ్డు, రూ.26కోట్లతో లింగగిరి నుంచి కల్మల్ చెరువు వరకు 13కిలోమీటర్ల డబుల్ రోడ్డు, రూ.23కోట్లతో అమరవరం నుంచి అలింగపురం వరకు 11.50కిలోమీటర్ల డబుల్ రోడ్లకు శంకుస్థాపన చేయాల్సి ఉన్నప్పటికీ, సమయంలేనందున మరోసారి వస్తానన్నారు.

చింతలపాలెం మండల కేంద్రం నుంచి వయా రేపూరు మీదుగా మేళ్లచెర్వు మండ లం రామాపురం వరకు రూ.20కోట్ల వ్యయంతో నిర్మించనున్న 10 కిలోమీటర్ల రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషిచేస్తున్నామని, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో ఒక సంవత్సరం కాలంలోనే కేవలం రోడ్ల నిర్మాణం కోసం రూ.500కోట్లు ఖర్చు చేశామని, నియోజకవర్గాల్లో సాగు, తాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యం, విద్యుత్, మౌలిక సదుపాయాల కోసం కృషిచేస్తున్నామని, నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని, పక్కా గృహాలు, ఎత్తిపోతల పథకాలతో నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మంత్రి ఉత్తమ్ అన్నారు. సభ ముగిసిన అనంతరం సభా వేదిక నుంచి హెలిప్యాడ్ వరకు ఓపెన్ టాప్ జీబులో ప్రజలకు అభివాదం చేస్తూ వెళ్లారు. మంత్రి ఉత్తమ్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ తిరుగు ప్రయాణంలో టేకాఫ్ సమయంలో సాంకేతికత సమస్యలతో మొరాయించింది. ఆతరువాత టేకాఫ్ అయింది.



ధనుర్మాసం.. తిరుప్పావై వ్రతం

- 30 రోజుల పాటు పాశురాల పఠనం
- ఉదయం కైంకర్య వేళల్లో మార్పులు

7



యాదగిరిగుట్ట మండలం కాచారంలో విద్యార్థినితో మాట్లాడుతున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

చదువుకు పేదరికం అడ్డుకాదు

- ఉల్లిగడ్డలమ్మి అమ్మ నన్ను చదివించింది
- దేశం అభివృద్ధి చెందాలంటే విద్యతోనే సాధ్యం
- విద్యతోపాటు సంస్కారం అలవర్చుకోవాలి
- హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ
- యాదగిరిగుట్ట మండలం కాచారంలో విద్యార్థులతో మాటాముచ్చట

7

చిన్న తప్పు.. పెద్దముప్పు

6



డంపింగ్ యార్డుల ద్వారా వర్మీకంపోస్టు

కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): డంపింగ్ యార్డుల ద్వారా సాధ్యమైనంత ఎక్కువ వర్మీకంపోస్టు తయారీకి కృషి చేయాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. అందుకు నూరుశాతం తడి, పొడి చెత్తలను సేకరించాలన్నారు. శుక్రవారం నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని చందనపల్లిలోని డంపింగ్ యార్డును ఆమె పరిశీలించారు. డంపింగ్ యార్డుతో తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, ఎప్పటికప్పుడు వర్మీకంపోస్టు తయారుపై దృష్టి సారించాలన్నారు. డంపింగ్ యార్డు పక్కనే ఉన్న స్థలంలో కబేళా ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. అనంతరం శేషమ్మగూడలో ఉన్న సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను తనిఖీ చేశారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో అశోక్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, తహసీల్దార్ శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

పెంచిన డైట్ చార్జీలను ప్రదర్శించాలి

ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు పెంచిన డైట్ చార్జీలను ఈనెల 14న ప్రారంభిస్తున్న నేపథ్యంలో వాటి వివరాలను ప్రతీ రెసిడెన్షియల్ పాఠశాల, కేజీబీవీ హాస్టళ్లలో అందరికీ కనిపించేలా ఫ్లెక్సీలను ప్రదర్శించాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆదేశించారు. శుక్రవారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం ఇటీవల 40శాతం డైట్ చార్జీలు పెంచిందన్నారు. మెనూలో సైతం కొన్ని మార్పులు తెచ్చిందని, కాస్మెటిక్ చార్జీలు సైతం పెంచిందన్నారు. జిల్లాలో 204 రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయని, ఈనెల 14న డైట్ చార్జీల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని, దీనికి విద్యార్థుల తల్లిదండ్రులను తప్పనిసరిగా ఆహ్వానించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొన్ని మండలాల్లో ముమ్మరంగా సాగుతోందని ఆయా మండలాల అధికారులను అభినందించారు. సర్వేను ఎలాంటి తప్పులు లేకుండా ఇలాగే కొనసాగించాలన్నారు. ఈ నెల 15, 16 తేదీల్లో గ్రూప్-2 పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా విజయవంతంగా నిర్వహించాలన్నారు. అనంతరం సమగ్ర ఇంటింటి సర్వేను సమీక్షించారు.



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కలెక్టర్

విద్యుత్ రంగాన్ని ఉద్యమాలతో కాపాడుకుంటాం

టీజీపీఈజేఏసీ చైర్మన్ వెంకటయ్య

నల్లగొండ టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగాన్ని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు విక్రయించే యత్నానికి స్వస్తి పలకాలని, లేదంటే ఉద్యమాలు, మెరుపు సమ్మెలతో కాపాడుకుంటామని టీజీపీఈజేఏసీ చైర్మన్ ఎస్.వెంకటయ్య టీజీపీఈఏ నేత, డీఈ నవీద్ అహ్మద్ అన్నారు. ప్రైవేటీకరణ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు శుక్రవారం సర్కిల్ కార్యాలయం ఎదుట విద్యుత్ ఉద్యోగులు నిరస న తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులంతా ఐక్యతతో సంస్థ రక్షణకు కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ విద్యుత్ ప్రైవేటీకరణ విధానాలను ఐక్యంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఇటీవల ఉత్తరప్రదేశ్, చండీఘడ్ విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారంచుట్టిందని, దీన్ని నిరసిస్తూ ఆయా రాష్ట్ర విద్యుత్ ఉద్యోగులు ప్రాణాలకు తెగించి ఉద్యమించారన్నారు. వారికి బాసటగా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల విద్యుత్ ఉద్యోగులు సంపూర్ణ మద్దతు తెలిపామన్నారు. అదే స్ఫూర్తి భవిష్యత్తులో కూడా సాగాలన్నారు. కార్యక్రమంలో ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు శంకర్, అన్నయ్య, వివిధ సంఘాల నాయకులు రవికుమార్, రాంబాబు, విశ్వం, గంజి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

గ్రూప్-2 పరీక్షా కేంద్రాల వద్ద
పటిష్ఠ భద్రత

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



నల్లగొండ టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 15, 16న రెండు రోజులు పాటు జరిగే గ్రూప్-2 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎస్పీ శరత్‌చంద్రపవార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు 29,118మంది అభ్యర్థులు హాజరవుతున్నారని, అందుకు నల్లగొండలో 59, మిర్యాలగూడ పట్టణంలో 28, మొత్తం 87 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. నల్లగొండలో 21,777 మంది, మిర్యాలగూడలో 7,941 మంది మొత్తం 29,118 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. కేంద్రాల వద్ద ఉదయం 6 నుంచి సాయంత్రం 8 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్, ఇంటర్‌నెట్ సెంటర్లను బంద్ చేయాలని, లౌడ్ స్పీకర్లు మోగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా కేంద్రం నుంచి 500 మీటర్ల వరకు ప్రజలు గుమికూడవద్దన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టికెట్‌లో పొందుపరిచిన విధంగా సమయానికి చేరుకోవాలన్నారు. అభ్యర్థులు పరీక్షా హాల్‌లోకి సెల్ ఫోన్లు, ట్యాబ్, పెన్ డ్రైవ్, బ్లూటూత్, ఎలక్ట్రానిక్ వాచ్, కాలిక్యులేటర్లు, వాలెట్లు వంటివి తీసుకువెళ్లడానికి అనుమతి ఉండదని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రంలోకి వెళ్లేముందే ప్రధాన గేటు వద్ద తనిఖీలు నిర్వహించే పోలీసులకు అభ్యర్థులు సహకరించాలని పేర్కొన్నారు.

పార్టీ బలోపేతానికి బూత్ కమిటీలే కీలకం

బీజేపీ సంఘటన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారి

నల్లగొండ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతం కావాలంటే గ్రామాల్లో బూత్ కమిటీలే కీలకమని బీజేపీ సంస్థాగత విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారి అన్నారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సంస్థగత ఎన్నికలపై సమీక్షా సమావేశం, సంఘటన్ పర్వ్‌లో ఆయన మాట్లాడారు. ఈనెల 17వ తేదీ వరకు జిల్లాలో బూత్ కమిటీల ఎన్నికలు నిర్వహించాలన్నారు. సంస్థగత ఎన్నికలు నిర్వహించుకునే ప్రక్రియ బీజేపీలో పారదర్శకంగా ఉంటుందన్నారు. కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తకు అవకాశాలు దక్కుతాయన్నారు. కమిటీలు నిర్వహించిన అనంతరం ఈ నెల 22, 23 తేదీల్లో మండల అధ్యక్షుల నియామకాలు జరగాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు, మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, కన్వంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, కల్యాణ్ నాయక్, తోటపల్లి రవికుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్ తివారి

రైతుల అరెస్టుకు నిరసనగా సీఎం దిష్టిబొమ్మ దహనం

రైతుల అరెస్టుకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ, రైతు భరోసా గురించి ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు హంతకుడిలా బేడీలు వేయడం అమానుషమని అన్నారు. రైతులకు అండగా బీజేపీ నిరంతరం పోరాడుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు పిల్లి రామరాజు, పోతెపాక సాంబయ్య, లోకనబోయిన రమణముదిరాజ్, విద్యాసాగర్ రెడ్డి, మిర్యాల వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

చిన్న తప్పు పెద్దముప్పు



- విద్యుత్ తీగల వ్యవస్థలో లోపాలతో ప్రమాదాలు
- కోదాడ, హుజూర్‌నగర్ పరిధిలో రెండేళ్లలో 69 ఘటనలు
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 15 లక్షల విద్యుత్ కనెక్షన్లు

అగ్ని ప్రమాదాలకు ప్రధానంగా షార్ట్ సర్క్యూట్‌లు కారణంగా ఉంటున్నాయి. విద్యుత్ కానరాని నిప్పు కాగా దానితో నిర్లక్ష్యంగా ఉంటే ముప్పును వెంటబెట్టుకున్నట్లే. ఆస్తి, ప్రాణనష్టాలను చవిచూడాల్సి వస్తుంటుంది. సామర్థ్యం తక్కువగా తీగలు వాడడం, అవి మొత్తపడటం, ముద్దవడం, కలిగి పక్కపక్క తీగలు తగలడంతో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు ఎగిసి పెద్ద ప్రమాదాన్నే తెచ్చిపెడుతున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు.
(ఆంధ్రజ్యోతి-కోదాడ)

విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్లు పునాది దిమ్మెలు కూడా ఐదు అడుగుల కన్నా తక్కువ ఎత్తులో ఉండటంతో మూగజీవాలు తగిలి మృత్యువాత పడుతున్నాయి. వెరసి విద్యుత్ తీగలతో పెద్ద ముప్పు వాటిల్లుతోంది.పొలాల్లో విద్యుత్ స్తంభం నుంచి వచ్చే సర్వీసు తీగలకు ఎటువంటి ఆధారాలు లేకుండా భూమిపైనే పరచడం, ఆయా తీగలపై ఉన్న ప్లాస్టిక్ ఊడిపోతుండటం వాటికి సమీపంలోకి వెళ్లినప్పుడు రైతులు మృత్యువాత పడుతున్నారు. కొన్నిచోట్ల తక్కువ ఎత్తులో ఉన్న తీగల కింది నుంచి గడ్డి, ధాన్యం లోడుతో ఉన్న వాహనాలు వెళ్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒకటి నిర్లక్ష్యం, కాగా మరొకటి నాణ్యతా కలిగిన సర్వీసు వైర్లు వాడకపోవటమే అని నిపుణులు పేర్కొంటున్నారు. ఇటువంటి సంఘటనలు గత రెండేళ్లలో సూర్యాపేట జిల్లా కోదాడ, హుజూర్‌నగర్ పరిధిలో 69 జరిగినట్లు విద్యుత్ ప్రమాదాల గణంకాలు చెబుతున్నాయి.

జాగ్రత్తలతోనే అపాయం దూరం

సాంకేతికపరంగా జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలు నివారించవచ్చునని నిపుణులు చెబుతున్నారు. ఒక భవనంలో రెండు లేదంటే అంతకన్నా ఎక్కువ ఏసీలు, ఇతర ఉపకరణాలకు ఒకే సర్క్యూట్‌లో కనెక్షన్లు ఇస్తే ప్రమాదాలకు ఆస్కారం ఇచ్చినట్లే అంటున్నారు. ఒక ఏసీ, ఇతర ఉపకరణాలు కలిపి ఒక సర్క్యూట్ తీసుకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉండదంటున్నారు. దానికి ఒక సూక్ష్మ వలయ విభజిని(మినీయేచర్ సర్క్యూట్ బ్రేకర్-ఎంసీబీ)ని అమర్చాల్సి ఉంటుంది. ఇలా భవనంలో విద్యుత్ లోడ్‌ను ఎంసీబీకి అనుసంధానించి, క్రమపద్ధతిలో లోడ్ పెరగకుండా వేరు చేయడం ద్వారా చాలాప్రమాదాలను అడ్డుకోవచ్చునని నిపుణులు పేర్కొంటున్నారు. ఒక వేళ షార్ట్‌సర్క్యూట్ అయినప్పటికీ ఈ ఎంసీబీ వెంటనే విద్యుత్‌ను తనంతట తానుగానే ఆఫ్ చేసుకోవడం, ప్రమాద తీవ్రతను తగ్గించుకోవడం జరుగుతుందని చెపుతున్నారు. అంతేకాక వినియోగించే విద్యుత్ వైర్లు నాణ్యతతో కూడినవై ఉండాలి. రైతులు పొలంలో వాడే సర్వీసు వైర్లకు తప్పక పోల్స్‌ను వాడితే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చని సూచిస్తున్నారు.

● కోదాడ, హుజూర్‌నగర్ పరిధిలో...

సంవత్సరం	ప్రమాదాలు	క్షతగాత్రులు	మృతులు	మృతిచెందిన మూగజీవాలు
2022-23	51	17	02	34
2023-24	18	16	00	16
మొత్తం	69	33	02	50



గురువారం కోదాడలో షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ఇల్లు

హెచ్చరిస్తున్న ప్రమాదాలు

- ఇటీవల కోదాడ పట్టణంలోని సాయినగర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఆస్తి నష్టం భారీగా జరిగింది. కాలనీవాసులు బాధిత కుటుంబానికి కొంత ఆర్థికసాయం అందించారు.
- తాజాగా గురువారం కోదాడ పట్టణంలో రెడ్‌చిల్లీ సమీపంలో సాయినగర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో భవనంలోని సామాగ్రి పూర్తిగా దగ్ధమైంది. ఉద్యోగులైన భార్యాభర్తలు విధులకు వెళ్లగా ప్రమాదం చోటుచేసుకుంది. రూ.30లక్షల మేర ఆస్తి నష్టం జరిగింది.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 15 లక్షల కనెక్షన్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వ్యవసాయ, పరిశ్రమలు, గృహ విద్యుత్ కనెక్షన్లు 15 లక్షలకు పైగా ఉన్నట్లు సమాచారం. అందులో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 4 లక్షలకు పైగా ఉన్నట్లు సమాచారం. కాగా పొలాల సమీపంలో గత సంవత్సరంలో విద్యుత్ ప్రమాదాల వల్ల పదుల సంఖ్యలో మనుషులు, గేదెలు మృత్యువాత పడినట్లు సమాచారం. అదేవిధంగా ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న సూర్యాపేట జిల్లా కోదాడ, హుజూర్‌నగర్ పరిధిలో 2.96 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉండగా, నిత్యం 5.8684 మిలియన్ల యూనిట్ల విద్యుత్ వాడకం జరుగుతోంది.

ఎవరి ఆస్తులకు వారే బాధ్యులు



విద్యుత్ విషయంలో జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలకు ఆస్కారం ఉండదు. ఎవరి ఆస్తులు వారే కాపాడుకోవాల్సిన బాధ్యత ఉంది. రాజీపడి తక్కువ సామర్థ్యం కలిగిన విద్యుత్ వైర్లు వాడవద్దు. దీంతో లోడ్ పెరిగినప్పుడు షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వచ్చే ప్రమాదం ఉంటుంది. ఎంసీబీలు ఏర్పాటు చేసుకుంటే ప్రమాద పరిధి తగ్గుతుంది. క్షణాల్లో కాలిపోయే కాగితాలు, దుస్తువులు, వస్తువులు విద్యుత్ తీగల పక్కన ఉంచొద్దు. ట్రాన్స్‌ఫార్మర్లు ఎత్తు తక్కువలో ఉన్నట్లు గమనిస్తే సమాచారం ఇవ్వాలి. ప్రమాదాల నివారణకు కంట్రోల్ రూం అందుబాటులో ఉంటుంది. కోదాడ, హుజుర్‌నగర్ పరిధిలో ప్రమాదాలు జరిగితే 9394950944 ఫోన్ నెంబరును సంప్రదించాలి.

నిమ్మ వెంకటకిష్టయ్య, డీఈ

స్కూళ్లలో నిత్యం గుడ్డు, పండు

- 40 శాతం పెరిగిన మెస్, కాస్మెటిక్స్ చార్జీలు
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3,731 ప్రభుత్వ పాఠశాలలు
- 4.50 లక్షల మంది విద్యార్థులు

కోదాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రతి రోజూ గుడ్డు, పండ్లు ప్రభుత్వం అందజేయనుంది. విద్యార్థులకు పోషకాలతో కూడిన భోజనం అందించటం, విద్యార్థుల హాజరుజరుశాతం, ఏకాగ్రతను పెంచటం, నేర్చుకునే సామర్థ్యాన్ని పెంచటం వంటి లక్ష్యాలను సాధించటానికి మధ్యాహ్న భోజన పథకం, కాస్మెటిక్స్ ఇచ్చే విధానం అమలుచేస్తోంది. ఈ విధానం 2017 నుంచి అమలు చేస్తోంది.కాగా నిత్యావసరాలు, కాస్మెటిక్స్ ధరలు పెరగటంతో విద్యార్థులకు సరిపడా ఆహారం, కాస్మెటిక్స్ అందకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రభుత్వం విద్యార్థుల ఇబ్బందుల తొలగించేందుకు డైట్, కాస్మెటిక్స్ చార్జీలను 40 శాతం పెంచుతూ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 3,731ప్రభుత్వ,53 కస్తూర్బా, ఇతర గురుకులాల పాఠశాలలు విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయా పాఠశాలలో సుమారు 4.50 లక్షల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు.



పెరిగిన మెస్ చార్జీలు ఇలా

తరగతి	పెంచక ముందు	పెంచిన తర్వాత
3 నుంచి 7	రూ.950	రూ.1,330
8 నుంచి ఇంటర్	రూ.1,500	రూ.1,540
కాస్మెటిక్స్ చార్జీలు		
బాలికలకు..		
3 నుంచి 7	రూ.55	రూ.175
8 నుంచి ఇంటర్	రూ.140	రూ.275
బాలుర విద్యార్థులకు		
3 నుంచి 7	రూ.62	రూ.150
8 నుంచి ఇంటర్	రూ.62	రూ.200

ఉమ్మడి ప్రభుత్వ పాఠశాలలు

నల్లగొండ	2,039
యాదాద్రి	712
సూర్యాపేట	980
మొత్తం	3,731

నిత్యం గుడ్డు, పండ్లు

మెస్ చార్జీలు పెరగటంతో విద్యార్థులకు నిత్యం గుడ్డు, అరటిపండు అందనుంది. పెరగకముందు మూడు రోజులకు ఒకసారి అందేవి. అదేవిధంగా పెరగక ముందు రోజుకు పప్పు 55గ్రాములు, పెరిగిన తర్వాత 150గ్రాములు, మిల్క్ 50ఎంఎల్ నుంచి 150ఎంఎల్ విద్యార్థులకు అందనుంది. అదేవిధంగా కటింగ్‌కు రూ.55 నుంచి రూ.100, బట్టలు వాషింగ్, హెయిర్‌ఆయిల్‌కు 40శాతం పెరగటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆనందపడుతున్నారు.

పెరిగిన చార్జీలతో నాణ్యమైన భోజనం



ప్రభుత్వం మెస్, కాస్మెటిక్స్ చార్జీలు పెంచటంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు ఆరోగ్యకరంగా ఉండేందుకు కాస్మెటిక్స్ అందనున్నాయి. దీంతో విద్యార్థులకు చదువులో ఏకగ్రత పెరుగుతుంది. ఫలితాలు ఉన్నంతగా ఉంటాయి. తల్లిదండ్రులు పాఠశాలకు పిల్లలను పంపేందుకు ఇష్టపడతారు. దీంతో పాఠశాలలో హాజరుశాతం పెరగనుంది.

సలీంషరీఫ్, ఎంఈవో

● పాఠశాల్లో ప్రస్తుత మెనూ

రోజు	ఆహారం
సోమవారం	కిచిడి, మిక్స్‌డ్ వెజిటేబుల్ కర్రీ, గుడ్డు
మంగళవారం	రైస్, సాంబారు, మిక్స్‌డ్ వెజిటేబుల్ కర్రీ
బుధవారం	రైస్, ఆకుకూరల పప్పు, మిక్స్‌డ్ వెజిటేబుల్ కర్రీ, గుడ్డు
గురువారం	వెజిటేబుల్ బిర్యానీ, మిక్స్‌డ్ వెజిటేబుల్ కర్రీ
శుక్రవారం	రైస్, సాంబరు, మిక్స్‌డ్ వెజిటేబుల్ కర్రీ, గుడ్డు
శనివారం	రైస్, ఆకుకూరల పప్పు, మిక్స్‌డ్ వెజిటేబుల్ కర్రీ



మామపై దాడి కేసులో
కోడలు అరెస్టు, రిమాండ్

వేములపల్లి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మామపై కోడలు చెప్పుతో దాడి చేసిన కేసులో కోడలును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ జిల్లా వేములపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. శెట్టిపాలెం గ్రామానికి చెందిన దివ్యాంగుడైన గగినపల్లి బుచ్చిరెడ్డి గత నెల 20న వీల్‌చైర్‌లో కూర్చొని ఉండగా, భూవివాదంతో ఆయన పెద్దకోడలు మణిమాల చెప్పుతో దాడిచేసింది. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డుకాగా, ఆ వీడియా సోషల్‌మీడియాలో ఈ నెల 8న వైరల్ అయి ంది. ఈ ఘటనపై వేములపల్లి పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి కోడలు మణిమాలను అరెస్టు చేసి, అనంతరం కోర్టులో హాజరుపర్చి, రిమాండ్‌కు తరలించారు.

త్రుటిలో తప్పిన
పెనుప్రమాదం

హ్యాండ్ బ్రేక్ ఫెయిలై లోయలో పడ్డ కారు

వలిగొండ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కారు హ్యాండ్ బ్రేక్ ఫెయిల్ కావడంతో ప్రమాదవశాత్తు కారు లోయలోపడింది. త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. ఈ సంఘటన శుక్రవారం యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలం వేములకొండలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం చౌటుప్పల్ మండలం కుంట్ల గూడెం గ్రామానికి చెందిన గంగదేవి లింగస్వామి తమ బంధువు కారును తీసుకొని మండలంలోని వెంకటాపురం గ్రామ పరిధిలోని మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దైవదర్శనానికి ఇద్దరు కుటుంబసభ్యులతో కలిసివచ్చాడు. గుట్టపైకి చేరుకొని కారును పార్కింగ్ చేసి కారులోంచి అందరూ దిగారు. ప్రమాదవశాత్తు కారు హ్యాండ్ బ్రేక్ ఫెయిల్ కావడంతో సమీపంలోని లోయలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో కారులో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. సంఘటనా స్థలానికి పోలీసులు పరిశీలించారు.



లోయలో పడి దెబ్బతిన్న కారు

కొనుగోలు దందా

- ఆంధ్రా ధాన్యం దిగుమతి
- చెల్లించని మద్దతు ధర
- బోనస్ కొట్టేసేందుకు మిల్లర్ల పన్నాగం



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి మేళ్లచెర్వుకు వస్తున్న ధాన్యం లారీలు

మేళ్లచెర్వు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమీప ప్రాంతాల్లో పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి మిల్లర్లు, వ్యాపారులు సుముఖత చూపడం లేదు. కానీ ఆంధ్ర ప్రాంతం ధాన్యం కొనుగోలుకు ప్రాధాన్యమిస్తున్నార్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆంధ్రా ప్రాంతం నుంచి అక్రమంగా రాష్ట్రంలోకి ప్రవేశించే ధాన్యం లారీలను మాత్రం గుట్టుచప్పుడు కాకుండా దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో ఆంధ్రా ప్రాంతం నుంచి వివిధ మార్గాల ద్వారా సన్నధాన్యం లారీలు తెలంగాణకు తరలివస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం సన్నరకం వరి ధాన్యానికి రూ. 500 బోనస్ ప్రకటించడంతో తెలంగాణ, ఆంధ్రా ధాన్యానికి క్వింటాకు రూ.500 ధర తేడా ఉంది. దీంతో బోనస్ వస్తుందన్న నమ్మకంతో అధిక సంఖ్యలో తెలంగాణ రైతులు ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లో విక్రయించలేదు. సన్నరకానికి ధర గతేడాది కంటే తక్కువగా ఉండటం, ఆంధ్రా ప్రాంతంలో మద్దతు ధర లేకపోవటంతో ధాన్యం ఇక్కడికి తరలిస్తున్నారు. తేమ, తరుగు, ధర మందం పేరుతో మద్దతు ధర 2300 ఉన్నా ఆంధ్రా ప్రాంతం నుంచి క్వింటా ధాన్యం రూ. 2000 నుంచి 2200లోపు కొనుగోలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్రమ మార్గాల ద్వారా ఆంధ్ర, తెలంగాణ దళారులు కలిసి గుట్టుచప్పుడు కాకుండా నిత్యం పదుల సంఖ్యలో వాహనాల ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు ప్రకటించిన క్వింటాల్‌కు రూ.500 బోనస్‌ను వివిధ అక్రమ మార్గాల్లో మద్దతు ధర పొందడమే ఈ అక్రమ వ్యాపారుల అంతిమ లక్ష్యంగా తెలుస్తోంది.

కల్లాలోనే పేరుకుపోయిన ధాన్యం నిల్వలు

రాష్ట్రంలో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పాటు బోనస్ కోసం రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించారు. కొనుగోలు కేంద్రాలలో రోజుల తరబడి రైతులు నిరీక్షిస్తున్నారు. మిల్లర్లు తెలంగాణ రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసుకోవడానికి తమ రైస్ మిల్లుల్లో ఖాళీ ప్రదేశం లేదని సాకులు చెబుతున్నారు. కానీ ఆంధ్రా నుంచి వచ్చే వాహనాలను మాత్రం దిగుమతి చేసుకుంటున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం

రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు పెట్టాం. నిఘా రాత్రీపగలు ఏర్పాటు చేశాం. ఆంధ్రా నుంచి వచ్చే ధాన్యం లారీలను ఎట్టి పరిస్థితిల్లోనూ రాష్ట్రంలోకి అనుమంతించడం లేదు. ప్రతీ వాహనాన్ని సరిహద్దుల్లోనే తనిఖీ చేస్తూనే ఉన్నాం.

పరమేష్, అంతిరెడ్డి , మేళ్లచెర్వు, చింతలపాలెం ఎస్ఐలు

సరిహద్దుల్లో కొనసాగుతున్న నిఘా

దామరచర్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులు పండించిన పంటలకు మద్దతు ధర లభించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు కొనసాగుతున్నాయి. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి రాష్ట్ర సరిహద్దు వద్ద పోలీసు, రెవెన్యూ శాఖతో పాటు పలు శాఖల సమన్వయంతో చెక్‌పోస్టును ఇటీవల ఏర్పాటుచేశారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడుతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన ధాన్యాన్ని రాష్ట్రంలోకి రాకుండా అడ్డుకుని, వెనక్కి పంపిస్తున్నారు. ధాన్యం సీజన్ పూర్తయ్యే వరకు చెక్‌పోస్టు కొనసాగించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతీ వాహనాన్ని పరిశీలించి జిల్లాలోకి రానిస్తున్నారు.



వాడపల్లి సమీపంలోని సరిహద్దులోని చెక్‌పోస్ట్

వెల్డింగ్ పనులు చేస్తుండగా
ఇరువురికి గాయాలు

నేరేడుచర్ల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి):సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలోని ఓ పారాబాయిల్డ్ రైస్‌మిల్లులో వెల్డింగ్ పనులు చేస్తుండగా ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జాన్‌పహాడ్ రోడ్డులో పారాబాయిల్ రైస్ మిల్లును ఓ కాంట్రాక్టర్ లీజుకు తీసుకుని మరమ్మతులు చేయిస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. కార్మికులు గోపీచంద్, నాగుల్‌మీరాలు వెల్డింగ్ చేస్తుంగా నిప్పు రవ్వలు పడి చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వీరిని చికిత్స నిమిత్తం చికిత్స నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వారిద్దరినీ సూర్యాపేట జిల్లా ఆసుపత్రికి తరలించారు.

పాత కక్షలతోనే హతమార్చారు



హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ చరమందరాజు

మఠంపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పాత కక్షలను నేపథ్యంలో పానుగోతు పాచును హత్య చేసినట్లు విచారణలో తెలిసిందని సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ సీఐ జీ చరమందరాజు వెల్లడించారు. ఈ నెల 5న బీమ్లాతండాకు చెందిన పాచు హత్యకు గురయ్యాడు. కేసుకు సంబంధించిన వివరాలను సీఐ శుక్రవారం మఠంపల్లిలో వివరించారు. మండలంలోని భీమ్లాతండాకు చెందిన పానుగోతు పాచు లారీ డ్రైవర్ పనిచేస్తున్నాడు. ఆయనకు భూవివాదం, లారీ యూనియన్ వ్యవహారంలో ఇదే తండాకు చెందిన పానుగోతు కొండానాయక్, పానుగోతు శోభన్‌లతో వివాదం ఉంది. ఈ నేపథ్యంలో పలుమార్లు గొడవలు, పంచాయితీలు జరిగాయి. పాతకక్షలు గొడవలను మనస్సులో పెట్టుకొని పథకం ప్రకారమే పాచును తండాకు చెందిన పీ కొండా, పీ శోభన్‌తో పాటు పీ కోటయ్య, పీ కోట్యాలు ఈ నెల 5న సుల్తాన్‌పురం తండా వద్ద కాపుగాసి ఇనుపరాడ్డుతో, కత్తి, రాళ్లతో కొట్టి హత్య చేశారన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి విచారించగా హత్య చేసినట్లు ఒప్పుకున్నారని దీంతో అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. భీమ్లాతండాలో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు. క్షణికావేశంలో గొడవలకు, హత్యలకు పాల్పడవద్దని, కుటుంబాలను, పిల్లల భవిష్యత్‌లను ఇబ్బందుల పాలు చేసి జైలుకు వెళ్లవద్దని సీఐ సూచించారు.

మాజీ ఎంపీపీ ఆత్మహత్యాయత్నం

గుర్రంపోడు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా గుర్రంపోడు మాజీ ఎంపీపీ మంచికంటి వెంకటేశ్వర్లు గురువారం రాత్రి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేశారు. వెంకటేశ్వర్లు మండల పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తుంటాడు. వ్యవసాయ భూములను క్రయ, విక్రయాలు చేస్తుంటాడు. ఇటీవల కాలంలో రియల్ ఎస్టేట్ కుదేలవడంతో కొన్న భూములు విక్రయం జరగకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడి ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలుస్తోంది. వెంకటేశ్వర్లు స్వగ్రామం మండలంలోని పాల్వాయి గ్రామం. కొండమల్లేపల్లిలో నివాసముంటున్నాడు. రోజు మాదిరిగానే మల్లెపల్లిలోని ఇంటికి చేరుకున్న ఆయన భోజనం అనంతరం బెడ్‌రూంలోకి వెళ్లి సుమారు 50 నుంచి 60 వరకు నిద్రమాత్రలు మింగినట్లు సమాచారం. తెల్లవారినా నిద్ర నుంచి లేవకపోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు తలుపు తెరిచి చూసే సరికి గాఢనిద్రలో ఉన్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే మలకపేట యశోద ఆస్పత్రికి తరలించారు. ఐసీయూలో చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. ఆర్థిక లావాదేవీలే ఆత్మహత్యాయత్నానికి కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు.

యువతులు అదృశ్యం



రేవతి

వలిగొండ, భువనగిరి టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగి జిల్లా వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు యువతులు అదృశ్యమయ్యారు. వలిగొండ ఎస్ఐ యుగేందర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని మొగిలిపాక గ్రామానికి చెందిన పి.మానస(20) ఒక ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. ఈ నెల 12న ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెదికినా, బంధువుల ఇళ్లలో గాలించినా ఆమె ఆచూకీ తెలియరాలేదు. ఫలితం కనబడలేదు. ఆమె తండ్రి అయిలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

- వైద్య చికిత్సల నిమిత్తం భువనగిరిలోని జిల్లా ఆసుపత్రికి వచ్చిన యువతి అదృశ్యమైంది. పట్టణ ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం భువనగిరి మండలంలోని బస్వాపురం గ్రామానికి చెందిన ఉడుత రేవతిని భర్త సాయికుమార్ శుక్రవారం ఉదయం జిల్లా ఆసుపత్రికి తీసుకువచ్చి వైద్య చికిత్స చేయించుకోమని వదిలివెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో భర్త ఆసుపత్రికి వచ్చి వెతకగా భార్య కనిపించలేదు. బస్వాపురంలోని ఆమె ఇంటికి వెళ్లి వాకబుచేయగా ఇంటికి రాలేదు. పరిసరాల్లో వెతికినా ఆచూకీ లభించనందున రేవతి తల్లి జోగి ఇందిర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆదర్శ ఉపాధ్యాయుల నిరసన బాట

(5వ పేజీ తరువాయి)

శాంతియుత నిరసనలు చేస్తున్న మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయులు దశలవారీగా చేపడుతున్న ఆందోళనలకు ప్రభుత్వం దిగిరాకపోతే తదుపరి కఠిననిర్ణయాలు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఈనెల 12, 13 తేదీల్లో మధ్యాహ్నభోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి ప్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. 16, 17 తేదీల్లో ఇదే విధంగా నిరసన తెలపనున్నారు. 18న మండల స్థాయి అధికారులకు వినతిపత్రాలు అందజేస్తారు. 19, 20 తేదీల్లో భోజన విరామ సమయాల్లో ప్లకార్డులతో తిరిగి నిరసన తెలిపి రాష్ట్ర వ్యాప్తంగా డీఈవో, డీఐఈవోలకు వినతిపత్రాలు అందజేస్తారు. 21, 22, 23 తేదీల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మంత్రులకు వినతిపత్రాలు అందజేస్తారు. 28న అన్ని జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్ల వద్ద ఒక రోజు దీక్ష నిర్వహించి, కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేస్తారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే జనవరి 4న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించి నిరసన తెలియజేయాలని నిర్ణయించారు.

పాఠశాల విద్యాశాఖలో విలీనం చేయాలి



మోడల్ స్కూల్ టీచర్లను ఏపీలో మాదిరిగా పాఠశాల విద్యాశాఖలో విలీనం చేసి, 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలి. నియామకాల సమయంలో సాంకేతిక సమస్యలతో రెండోవిడత నియమితులైనవారికి కూడా నోషనల్ సర్వీస్, ఇంక్రిమెంట్లు ఇవ్వాలి. తక్షణం అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలి. అదేవిధంగా మృతిచెందిన వారి స్థానాల్లో వారి కుటుంబీకులకు కారుణ్యనియామకాలు చేపట్టాలి. మా డిమాండ్లను నెరవేర్చకపోతే జనవరి 4న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహిస్తాం.

తరాల జగదీష్, ప్రోగ్రెసివ్ మోడల్‌స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

● న్యాయబద్ధమైన డిమాండ్లు పరిష్కరించాలి



మోడల్‌స్కూల్ టీచర్లుగా మా డిమాండ్లు న్యాయబద్ధమైనవి. మాకు హక్కుగా సంక్రమించాల్సిన వాటినే నెరవేర్చాలని కోరుతున్నాం. పదోన్నతులు, హెల్త్‌కార్డులు ఇవ్వాలి. పెండింగ్ బకాయిలు చెల్లించాలి. ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కోరుతున్నాం. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తుందని ఆశిస్తున్నాం.

పోతురాజు నరహరి, ప్రోగ్రెసివ్ మోడల్‌స్కూల్ టీచర్స్ అసోసియేషన్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు

ఆరోపణలపై విచారణ పూర్తి, మెమోలు జారీ



అంగన్‌వాడీ నిర్వాహకులను విచారిస్తున్న సీడీపీవో శ్రీదేవి

ఆత్మకూరు(ఎస్), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ నిర్వాహణపై విచారణ పూర్తి చేశామని, టీచర్‌తో పాటు ఆయాలకు మెమోలు జారీ చేస్తున్నట్లు సీడీపీవో శ్రీవాణి తెలిపారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండల కేంద్రంలోని మూడవ అంగన్‌వాడీ కేంద్రంలో కొద్దిరోజులుగా నిర్వహణ లోపం, పిల్లల సరుకులు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు, ఫిర్యాదుపై శుక్రవారం ఆమె కేంద్రాన్ని పరిశీలించి, విచారణ చేపట్టారు. కేంద్రంలోకి వచ్చిన పిల్లల తల్లిదండ్రులను విచారించి రికార్డును పరిశీలించారు. పిల్లలకి అందజేసే సరుకుల్లో తేడాలు గుర్తించారు. సమయపాలన పాటించడంలో టీచర్ నిర్లక్ష్యం వహిస్తుందని విచారణలో తేలినట్లు సీడీపీవో తెలిపారు. విచారణ నివేదికలను ఉన్నతాధికారులకు అందజేసి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ పద్మ, ఆయా సత్తమ్మ జిల్లా కేంద్రానికి వచ్చి మెమోలు తీసుకోవాలని ఆదేశించారు. ఆమె వెంట సూపర్‌వైజర్ సాయిగీత, అన్నపూర్ణ ఉన్నారు.

చెర్వుగట్టు హుండీ ఆదాయం రూ.42,79,130



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

నార్కట్‌పల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శైవక్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరుడి హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. మొత్తం 50 రోజులకు భక్తులు కానుకల రూపంలో సమర్పించుకున్న నగదు రూ. 42,79,130 లభించినట్లు ఈవో సిరికొండ నవీన్ కుమార్ తెలిపారు. గుట్టపై ప్రధానాలయంతో పాటు ఉపాలయాల వద్ద ఉన్న హుండీలను తెరిచి లెక్కించగా రూ.37,14,230, గుట్ట కింద పార్వతీ అమ్మవారి ఆలయం వద్ద ఉన్న హుండీలను లెక్కించగా రూ.5,64,900ల నగదు సమకూరింది. కాగా నిత్యాన్నదానం కోసం భక్తులు సమర్పించుకున్న విరాళాల ఆదాయం రూ.39,988 వచ్చినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమం లో దేవాదాయశాఖ డివిజన్ పరిశీలకురాలు బీ.సుమతి, ఆలయ సిబ్బంది, నంది గామ దుర్గాశివసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

మెట్ట పంటల సాగుతో అధిక దిగుబడులు



కంచి మల్లయ్యను సన్మానిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ అనిల్‌కుమార్

భువనగిరి రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి, మెట్ట పంటలను సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం, వ్యవసాయ పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా పాలెంలో శుక్రవారం విశ్వవిద్యాలయ వజ్రోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అదే విధంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ఏకైక ఉత్తమ రైతుగా భువనగిరి మండలం వీరవెల్లికి చెందిన కంచి మల్లయ్యను ఎంపిక చేశారు. అలాగే ఉత్తమ వ్యవసాయ విస్తరణ కేంద్రంగా ఎంపికైన శాస్త్రవేత్త డాక్టర్ అనిల్‌కుమార్‌ను సన్మానించి అవార్డును ప్రదానం చేశారు. ఉత్తమ రైతుగా ఎంపికైన కంచి మల్లయ్య మాట్లాడుతూ వరితో పాటు చిరుధాన్యాలు పప్పు దినుసు సాగు చేయడమే కాకుండా పాడి ద్వారా కూడా రైతులు ఆర్థిక పరిపుష్టి పొందవచ్చునన్నారు. సేంద్రియ పంటల ద్వారా సాగును చేపట్టడంతోనే తనకు ఈ అవార్డు దక్కిందన్నారు.


సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



కలెక్టరేట్ ఎదుట బతుకమ్మ ఆడుతూ నిరసన వ్యక్తం చేసున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

భువనగిరి (కలెక్టరేట్), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తమను పర్మనెంటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన సమ్మె శుక్రవారం 4 వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఎదుట వారు బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. అనంతరం ఉద్యోగులు మాట్లాడుతూ జిల్లాలో 500కు పైగా సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా ఉద్యోగులు పని చేస్తున్నారని వారికి కనీస సౌకర్యాలు, ఉద్యోగ భద్రత లేదన్నారు. సమ్మెకు పలు ఉపాధ్యాయ సంఘాలతో పాటుగా పలు ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. కార్యక్రమంలో కరుణాకర్, చందర్, సంధ్యారాణి, శిరీష, స్వామి, రేణుక, శ్రీనివాస్ తదితరులున్నారు.

● ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని సమగ్రశిక్షా ఉద్యోగులు ఎమ్మార్సీ కార్యాలయానికి నాలుగు రోజులుగా తాళం తీయకపోవడంతో మధ్యాహ్న భోజన బిల్లులన్నీ పెండింగ్‌లో ఉన్నా యి. ఈసందర్భంగా సమగ్ర శిక్షా ఉద్యోగులు మాట్లాడుతూ మా ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి ఏడాది కావస్తున్న అమలు చేయడంలేదన్నారు.



వెహికల్ అండర్‌పాస్ నిర్మించండి

● కేంద్రమంత్రి నితీన్ గడ్కరీకి విజ్ఞప్తి



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో చర్చిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

భువనగిరి (కలెక్టరేట్), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు వెహికల్ అండర్ పాసులు నిర్మించి ప్రజల ప్రాణాలను కాపాడాలని భువనగిరి పార్లమెంటు సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి శుక్రవారం ఢిల్లీలో కేంద్ర రోడ్లు, రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితీన్ గడ్కారితో వెహికల్ అండర్ పాస్ (వీయూపీ)లపై ఆయన చర్చించారు. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో వెహికల్ అండర్ పాసులు మంజూరీ చేయాలని విజ్ఞప్తి చేయడంతో సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో రెండు జాతీయ రహదారులున్నాయని, వరంగల్, విజయవాడ హైవేలపై వెహికల్ అండర్ పాసులు తప్పనిసరి అవసరమన్నారు. హైదరాబాద్-విజయవాడ హైవేలో చౌటుప్పల్ మండలం మల్కాపురం, ఖైతాపురం, ఎల్లగిరి, ధర్మోజిగూడెం, పంతంగి , చౌటుప్పల్ గ్రామాల వద్ద వెహికల్ అండర్ పాస్‌ల నిర్మాణం అత్యవసరమన్నారు. అలాగే హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారిపై బీబీ నగర్ మండలం కొండమడుగు, ఎయిమ్స్ వైద్యశాలతో పాటుగా బీబీనగర్ పట్టణంలో కూడా అవసరమని, భువనగిరి మండలం అనంతారం, సింగన్నగూడెం, రామక్రిష్ణాపురం క్రాస్‌రోడ్డు వద్ద అండర్ పాసింగ్ ఏర్పాటు చేయాలని కోరినట్లు చెప్పారు.

ధనుర్మాసం..తిరుప్పావై వ్రతం



భువనగిరి అర్బన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం అంటే గోదాదేవికి ప్రత్యేక పూజలు.. పాశురాల పఠనం..ప్రసాద నివేదన పర్వాలు.. ధనస్సు రాశిలో సూర్యుడు ప్రవేశించిన అనంతరం ధనుర్మాసోత్సవాలు (ఈనెల 16 నుంచి) ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలు రోజు వేకువ జామున 30 రోజులు అమ్మవారికి పూజలు చేపట్టి పాశురాలు పఠించడం ఆనవాయి తీ.

తిరుప్పావై ప్రబంధం

గోదాదేవి నెల రోజుల పాటు వ్రతాన్ని ఆచరించి రంగ నాథుడి వివాహం చేసుకుందని పురాణాల చెబుతున్నాయి. ఆండాళ్ అమ్మవారు అనుగ్రహించిన తిరుప్పావై ప్రబంధం పఠిస్తారు. మూలమూర్తులు, ఉత్సవమూర్తులకు ఏకాంత తిరుమంజనం అనంతరం తిరుప్పావై నిర్వహిస్తారు.

రోజుకో పాశుర పఠనం

నిత్యం తెల్లవారు జామున బాలభోగం నిర్వహించి 30 తిరుప్పావై పాశురాల్లో రోజుక్కొక్క పాశురాన్ని పఠిస్తారు. ఈ మాసంలోనే పార్వతిదేవి తపస్సు చేసి పరమేశ్వరుడిని పొందిందని, గోపికలు కాత్యాయని వ్రతాన్ని ఆచరించి శ్రీకృష్ణ సాంగత్యాన్ని పొందారని భక్తుల విశ్వాసం. ధను ర్మాసంలో కూడారై ఉత్సవాన్ని నిర్వహించుట చేత 27వ రోజు ఎంతో విశిష్టమైంది. స్వామివారికి తనకు వివాహం జరిగితే 108 గంగాళాల పాయసంతో రంగనాథునికి నివేదిన చేస్తానని అమ్మవారు మొక్కుకొని శ్రీరంగనాథున్ని పొందిందని ప్రతీతి.

మార్గళిలో ముగింపు

సూర్యుడు దనస్సు రాశీలోకి ప్రవేశించడాన్ని మార్గళీ మాసం అని కూడా అంటారు. తెల్లవారు జామున బ్రహ్మ ముహూర్తంలో ఆండాళ్ అమ్మవారు రచించిన 30 తిరుప్పావై పాశురాలను ధనుర్మాసంలో పఠించడం ఆచారం. మార్గళీమాసం నందు వ్రతం చేసి అమ్మవారు భగవంతుని సన్నిదానం చేరిందని, ధనుర్మాసం చివరి రోజు మకర సంక్రాంతి రోజు అమ్మ వారికి కల్యాణం జరిపించడం తో మార్గళీమాసం ముగుస్తోంది. ఈ మా సంలో పూజలు చేసిన వారికి ఆగ మశాస్త్రం ద్వారా సమస్త కార్యసిద్ధి లభిస్తోందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

30 రోజుల పాటు పాశురాల పఠనం

ఉదయం కైంకర్య వేళల్లో మార్పులు

16నుంచి ధనుర్మాస ఉత్సవాలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా జనవరి 14 వరకు ఉద యం కైకర్యం వేళల్లో మార్పుచేసినట్లు ఈవో భాస్క రరావు తెలిపారు. ఉదయం 3.30గంటలకు ఆలయం తెరిచి, 4గంటల వరకు సుప్రభాతం, 4 నుంచి 5 గంటల వరకు తిరువారాధన, బాలభోగం, ఆర గింపు (సాధారణ రోజుల్లో 4.30 నుంచి 5.15వరకు), 5నుంచి 5.45వరకు తిరుప్పావై సేవాకాలం, తీర్థప్రసాద గోష్ఠి, 5.45నుంచి 6.45 వరకు నిజాభిషేకం(సాధారణ రోజుల్లో(5.15 నుంచి 6.15), 6.45 నుంచి 7.15వరకు సహస్ర నామార్చన(సాధారణ రోజుల్లో 6.15 నుంచి 7), 7.15 నుంచి సర్వదర్శనాలకు (సాధారణ రోజుల్లో 7.30) అను మతిస్తారు. జనవరి 13న గోదాదేవి కల్యాణం, 14న ఒడి బియ్యం చేపట్టనున్నారు. నిత్యం తెల్లవారు జామున 5నుంచి 5.45 గంటల వరకు అమ్మవారిపై ఆలపించే తిరుప్పావై, మార్గళి పర్వాలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధం చేశారు. గోదాదేవి అమ్మవారి పాశురాలను పఠించేందుకు పండితులను ఆలయానికి ఆహ్వానించినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	581.80
టీఎంసీలు	288.2060
ఎడమకాల్వకు నీటి విడుదల	6,791
కుడికాల్వకు	6,979
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	16,170
అవుట్‌ఫ్లో	35,315 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.48అడుగులు
టీఎంసీలు	4.33
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	53.93క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	239.60 క్యూసెక్కులు

డెలివరీ బాయ్స్‌కు ఓటీపీ చెప్పాలి

మోత్కూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భారత్ గ్యాస్ వినియోగదారులు గ్యాస్ బుక్ చేసుకున్నాక వినియోగదారుని రిజిస్టర్డ్ మొబైల్‌కు వచ్చే ఓటీపీ విధిగా సిలిండర్ డెలివరీ బాయ్స్‌కు చెప్పాలని భారత్ గ్యాస్ మోత్కూరు కార్యాలయం ఇన్‌చార్జి ఆంజనేయులు కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇది కేంద్రప్రభుత్వ నిర్ణయమన్నారు. ఈకేవైసీ చేయించని వారు ఈ నెల 25 లోగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. భద్రత తనిఖీ (సేఫ్టీ చెక్) సిబ్బంది గ్యాస్ సిలిండర్, స్టౌవ్ తనిఖీ చేసేందుకు సహకరించాలన్నారు. ఓటీపీ చెప్పక పోయినా, భద్రత తనిఖీ చేయించుకోక పోయినా సిలిండర్ సరఫరా నిలిపివేస్తారన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయం ముస్తాబు

(హుజూర్‌నగర్ -ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని వేణుగోపాల-సీతారామచంద్రస్వామి ఆలయంలో ఈనెల 16 నుంచి జనవరి 16 వరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. 16న సోమవారం గోపూజతో ధనుర్మాస ఉత్సవం ప్రారంభించనున్నారు. ఈ నెల 21న గరుడవాహన సేవ, 28న గజవాహన సేవ, జనవరి 4న హనుమత్‌వాహనసేవ నిర్వహించనున్నారు. 13న భోగి ఉత్సవం సందర్భంగా గోదారంగనాథస్వామి కల్యాణ వేడుకలు, 14న మకరసంక్రాంతి సందర్భంగా గోదాదేవి అమ్మవారికి గ్రామసేవ నిర్వహించనున్నారు. అదేరోజు సాయంత్రం గోదాదేవికి మంజలి ఉత్సవం, 15న కనుమ పండుగ, అదేరోజు సాయంత్రం అద్దాల మండపంలో పవళింపు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈఓ గుజ్జుల కొండారెడ్డి, అర్చకులు మురళిచార్యులు, నర్సిం హాచార్యులు, భాస్కరాచార్యులు, రంగభట్రాచార్యులు తెలిపారు.



విద్యుద్దీపాల అలంకరణలో వేణుగోపాలస్వామి ఆలయం

చదువుకు పేదరికం అడ్డుకాదు

» హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ » విద్యతోపాటు సంస్కారం అలవర్చుకోవాలి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న గవర్నర్ దత్తాత్రేయ

యాదగిరిగుట్ట రూరల్, భువనగిరి అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): 'చదువుకు పేదరికం అడ్డు కాదు.. నా చిన్నతనంలోనే నాన్న మృతి చెందడంతో, అమ్మ ఉల్లిగడ్డలమ్మి నన్ను చదివించింది' హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం కాచారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో ము చ్చటించారు. ప్రతిఒక్కరూ విద్యతోపాటు సంస్కారం అలవర్చుకోవాలన్నారు. పేదరికం చదువుకు అడ్డుకాదని, సదుపాయాలు లేకున్నా ఏదైనా సాధించగలననే ఆత్మవిశ్వాసం, దృఢసంకల్పం, ధైర్యంతో ముందుకు సాగాలన్నారు. ఆడపిల్లలు ఎక్కువ శాతం విద్యలో రాణిస్తున్నారని, తన చిన్నతనంలోనే తన తండ్రి మృతి చెందడంలో తన తల్లి ఉల్లిగడ్డల వ్యాపారం చేస్తూ తనను ఎంతో కష్టపడి చదివించిందన్నారు. తల్లి తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబె ట్టేందుకు కష్టపడి ఉన్నత చదువులు చదివి ముందుగా సిండికేట్ బ్యాంకులో ఉద్యోగిగా చేరానని, చదువుతోపాటు సామాజికస్పృహ పెంచుకొని ఎంపీ, మంత్రి, గవర్నర్‌గా పదవులు అలంకరించానని వివరించారు. నేటి యువత ఎక్కువ శాతం డ్రగ్స్‌కు బానిసలుగా మారి, బం గారు భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని దత్తాత్రేయ సూచించారు. తమ బీడీ(బండారు దత్తాత్రేయ) ఫౌండేషన్ ద్వారా పాఠశాలకు కావాల్సిన సైన్స్‌ల్యాబ్, కంప్యూటర్లను అందజేస్తానని హామీ ఇచ్చారు.

యాదగిరీశుడిని దర్శించుకున్న గవర్నర్

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి వారిని గవర్నర్ బండారు దత్తాత్రేయ దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు తొలుత దత్తాత్రేయకు పూర్ణకుంభ స్వాగతం పలకగా వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ క్షేత్ర వైభవం రోజురోజు కు వ్యాప్తి చెందడం ఎంతో సంతోషకరమన్నారు. అంతకు ముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించగా, భువనగిరి కలెక్టర్ హనుమంతరావు గవర్నర్‌కు స్వాగతం పలికారు.

స్వర్ణగిరి సేవలో గవర్నర్

భువనగిరి గంజ్ : భువనగిరిలోని స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామిని గవర్నర్ బండారు దత్తాత్రేయ దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ముందుగా ఆలయ అర్చకులు, స్వాములు, మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో తులభారం, పరిసరాలను కలియుగంగా తిరిగారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వేముల అశోక్, మహేందర్ గుప్త, రత్నపురం బలరాం, సురేష్‌రెడ్డి, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

వ్యాపారుల సమస్యలు పరిష్కరించండి

స్థానిక దేవస్థానంలో భక్తులు, స్థానిక వ్యాపారులు అనేక సమస్యలతో ఇబ్బందుల పడుతున్నప్పటికీ ప్రభుత్వం పటించుకోవడం లేదని వాటిని పరిష్కరానికి కృషి చేయాలని కోరుతూ సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు గవర్నర్ దత్తాత్రేయకు విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా గత ప్రభుత్వం, అధికారులు అనాలోచిత నిర్ణయాలతో నిర్మించిన బ్రిడ్జితో స్థానిక వ్యాపారులు, స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

గవర్నర్‌ను కలిసిన రాజాపేట నాయకులు

రాజాపేట : గవర్నర్ బండారు దత్తాత్రేయను రాజాపేట మండల నాయకులు కలిసి పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఆయనను రాజాపేట మండల బీజేపీ నాయ కులు దాచేపల్లి రాజు, రాంచంద్రం, మెండు భగవాన్‌రెడ్డి, మార్క శివ, శ్రవణ్, కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. అలాగే రాష్ట్ర ఉప కులాల కన్వీనర్ పిల్లుట్ల పశుపతి గవ ర్నర్‌ను కలిసి జానపద వృత్తి, కళాకారుల పరిస్థితులపై వినతిపత్రాన్ని అందజేశారు.

ఉదయం ఎన్ని గంటలకు లేస్తారు

మీరు ఉదయం ఎన్ని గంటలకు లేస్తారు, లేచిన తర్వాత ఏం చేస్తారు అని ఎనిమిదో తరగతి విద్యార్థినులు నవ్యశ్రీ, కార్తీక శ్రీ, పదో తరగతి విద్యార్థి శివ కుమార్‌ను గవర్నర్ బండారు దత్తాత్రేయ అడిగారు. అయితే ఒక విద్యార్థి ఉదయం 5 గంటలకు, మరో విద్యార్థి 6 గంటలకు లేస్తామని చెప్పారు. దీంతో గవర్నర్ స్పందిస్తూ ప్రతీ విద్యార్థి ఉదయాన్నే నిద్రలేచి, గంట పాటు వ్యాయామం, యోగా అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం వడ్డే మహదేవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10వతరగతి విద్యార్థులకు ఏర్పాటుచేసిన స్టడీ మెటీరియల్‌ను ఆయన అందజేశారు. కార్యక్రమంలో డీసీపీ రాజేష్ చంద్ర, ఆర్డీవో కృష్ణారెడ్డి, డీఈవో సత్యనారాయణ, తహసీల్దార్ దేశ్యానాయక్, ఎంఈవో శరత్‌యామిని, ఎంపీవో సలీం, ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, మాజీ జడ్పీటీసీ తోటకూరి అనురాధాబీరయ్య, వడ్డే మహదేవ్ ఫౌండేషన్ చైర్మన్ ఉపేందర్, మాజీ ఎంపీపీ దడిగె ఇస్తారి, బీజేపీ రాష్ట్రనేతలు గూడూరు నారాయణరెడ్డి, రచ్చ శ్రీనివాస్, కాదూరి అచ్చయ్య, బీజేపీ పట్టణాధ్యక్షుడు గుంటిపల్లి సత్యం, కర్రె ప్రవీణ్, రాజమణి, మాజీ సర్పంచ్ కొండం అరుణాఅశోక్‌రెడ్డి, కొల్లూరి రాజయ్య, పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహుడికి వైభవంగా సువర్ణ పుష్పార్చన



ఊంజల్ సేవోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసిం హ స్వామికి శుక్రవారం సువర్ణ పుష్పార్చన, ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. పూజారులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయం భవులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం వేళ ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మ వారిని దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకులు ప్రాకార మండపంలోని అద్దాల మండపం ఊయలలో అధిష్ఠింపజేశారు. అర్చకుల వేద మంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో కొనసాగాయి. అనుబంధ శివాలయంలో రామ లింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో చండీహోమం నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ.22,31,355 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

లౌకిక ప్రజాస్వామిక స్ఫూర్తిని కొనసాగిద్దాం

మిర్యాలగూడ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ లౌకిక ప్రజాస్వామిక స్ఫూర్తి రచయితలు కొనసాగించాలని సమూహ రైటర్స్ ఫోరం రాష్ట్ర నాయకులు కస్తూరి ప్రభాకర్ అన్నారు. శుక్రవారం సమూహ రైటర్స్ తొలి రాష్ట్ర మహసభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలు భిన్న మత విశ్వాసాలతో, పరస్పర గౌరవంతో సోదర భావంతో జీవించేలా భారత రాజ్యాంగంలో లౌకిక పదాన్ని చేర్చారని చెప్పారు.డిసెంబర్ 14 న మహబూబ్‌నగర్ క్రౌన్ ఫంక్షన్ హల్ ఉదయం 10 గంటలకు సమూహ రైటర్స్ రాష్ట్ర మహసభ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. రచయితలు, ప్రజా స్వామిక వాదులు, లౌకిక వాదులు పెద్ద ఎత్తులో పాల్గొని మహసభను విజయవంతం చేయాలని కోరారు.

కేర్ టేకర్ ఉద్యోగానికి అనర్హులను ఎంపిక చేశారని ..

సంస్థాన్ నారాయణపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురంలోని ఆదర్శ పాఠశాలలో కేర్ టేకర్ ఉద్యోగానికి అనర్హురాలిని ఎంపిక చేశారని ఆరోపిస్తూ "సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని చౌరస్తాలో ఫైనల్ లిస్టుకు ఎంపికైన మహిళలు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. అక్టోబర్‌లో ఆదర్శ పాఠశాలలో కేర్‌టేకర్ కోసం దరఖాస్తులకు ఆహ్వానిస్తే దరఖాస్తు చేస ుకున్నా మని జెట్టి మహేశ్వరి, బర్ల స్వాతి, బొకారం దనమ్మ తెలిపారు. మండల వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తుల్లో బీఈడీ పూర్తి చేసిన ముగ్గురు యువతులను మెరిట్ ప్రకారం ఎంపిక చేసినట్టు తెలిపారు. ముగ్గురిని ఇంటర్వ్యూకు పిలిచారని ఇంటర్వ్యూ నిర్వహించకుండానే మీలో ఒకరిని ఎంపిక చేస్తామని ఎంఈవో హామీ ఇచ్చి నట్టు తెలిపారు. మూడు రోజులుగా ఎమ్మార్సీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఎంఈవో పట్టించ ుకోవడం లేదని ఆరోపించారు. తీరా చూస్తే మా ముగ్గురిని కాదని ఎంఈవో మరొకరిని ఎంపిక చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ ఒత్తిడితో మాకు రావాల్సి ఉద్యోగాన్ని అనర్హులకు ఇచ్చారని వాపోయారు. ఈవిషయమై తమకు న్యాయం చేయాలని కోరుతూ ఆందోళన చేశారు. ఆందోళన చేస్తున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. న్యాయం జరిగేంత వరకు పోరాడుతామని వారన్నారు.



రహదారిపై ఆందోళన చేస్తున్న మహిళలు

జాతీయస్థాయి షూటింగ్‌కు నాగుర్‌వలీ

చిట్యాల, డిసెంబరు13, (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు చిట్యాల రాము స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థి ఎస్‌కే నాగుర్‌వలీ ఎంపి కయ్యారు. గత నెలలో నారాయణఖేడ్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతి భ కనబర్చడంతో ఈ నెల 27 నుంచి పశ్చిమబెంగాల్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు అకాడమీ డైరెక్టర్ గంగాపురం రాము తెలిపారు. నాగుర్ వలీని శుక్రవారం పలువురు అభినందించారు.



నాగుర్‌వలీని అభినందిస్తున్న రాము

నేడు లోక్ అదాలత్

శాలిగౌరారం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో చేసిన తప్పులకు కక్షిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందని శాలిగౌరారం ఎస్ఐ డి.సైదులు అన్నారు. శుక్రవారం ఆయన శాలిగౌరారంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 14వ తేదీన నకిరేకల్‌లోని కోర్టులో లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజీ మార్గమే రాజమార్గమని ఆయన సూచించారు. రాజీపడటం వల్ల కక్షిదారులకు ఇరువురికి, సమయంతో డబ్బు ఆదా అవుతుందని ఆయన సూచించారు.


విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యేలా చూడాలి

నార్కట్‌పల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14 నుంచి ప్రారంభం కానున్న యూనిఫాం డైట్ ప్రోగ్రామ్‌కు విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికార చరిత సూచించారు. నార్కట్‌పల్లి మండలంలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించి తగు సూచనలు చేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఎల్. వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో కే.ఉమేష్ చారి, ఎంపీవో సుధాకర్, ఎంఈవో నర్సింహ, నాయబ్ తహసీల్దార్ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఆహ్లాదం.. ఆరోగ్యం..

» మార్నింగ్ వాకింగ్‌కు ట్రాక్‌లు » సెలవు రోజుల్లో కుటుంబ సమేతంగా సందర్శన





రామగిరి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పార్కులు ఆహ్లాదంతో పాటు ఆరోగ్యం పంచుతున్నాయి. పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డులో గల రాంనగర్‌పార్క్, రాజీవ్ పార్క్, చర్లపల్లి బైపాస్ రోడ్డులో పార్కులు ఉన్నాయి. ఈ పార్కుల్లో ఉదయం, సాయంత్రం పట్టణ ప్రజలు సేద తీరుతున్నారు. పార్కుల్లో మార్నింగ్ వాకింగ్ కోసం ట్రాక్‌లు ఏర్పాటు చేశారు. పార్కుల్లో ఉండే జిమ్‌లతో వ్యాయామాలు చేస్తున్నారు. పండుగలు, ఇతర కార్యక్రమాల సందర్భాల్లో పార్కులకు వెళ్తున్నారు. సెలవు రోజుల్లో కుటుంబ సభ్యులందరూ కలిసి ఉదయం నుంచి సాయంత్రం వరకూ అక్కడే ఉండి ప్రకృతిని ఆస్వాదిస్తున్నారు. ఉయ్యాలలు, బోట్లు, వర్చువల్ రియాలిటీ గేమ్స్, మ్యూజిక్ ఫౌంటేన్ వంటివి కనువిందు చేస్తున్నాయి. గతంలో ఇలాంటి సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు పెద్దగా ఆసక్తి చూపేవారు కాదు. కొత్తగా ఏర్పడిన పాలకవర్గం పార్కుల అభివృద్ధికి నిధులు కేటాయించడంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఫలితంగా పట్టణ ప్రజలు పార్కులు ఆహ్లాదం పంచుతున్నాయి. తల్లిదండ్రులు చిన్నారులతో కలిసి ఆటపాటలతో కాలక్షేపం చేస్తున్నారు. పార్క్ ఎంత అభివృద్ధి చెందినప్పటికి కొన్ని సమస్యలు మాత్రం వేధిస్తూనే ఉన్నాయి. ప్రధానంగా మూత్రశాలలు ఉన్నా వాటి నిర్వాహణ సరిగ్గా లేకపోవడం వల్ల మహిళలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అంతేకాకుండా అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమరాలు సైతం పని చేయడం లేదు.



సమస్యలన్నింటినీ త్వరలోనే పరిష్కరమవుతాయి


గతానికి పోల్చుకుంటే పార్కులు ఎంతో అభివృద్ధి అయ్యాయి. సమస్యలు కూడా నా దృష్టికి వచ్చాయి. వాటిని వీలైనంత త్వరగా పరిష్కరిస్తాం.
- బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్



పట్టణంలోని పంచతంత్ర పార్కు



వైఎస్సార్ పార్కులో ఏర్పాటు చేసిన నల్లగొండ లోగో



వైఎస్సార్ పార్కులో పట్టణ వాసుల సందడి

16 నుంచి ధనుర్మాస ఉత్సవాలు

శాలిగౌరారం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారంలోని సీతారామ చంద్ర స్వామి ఆలయంలో ఈనెల 16 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త శేషం రత్నమాచార్యులు, శేషం జగన్మోహనచార్యులు తెలిపారు. 16న శ్రీమన్నారాయణ మాలాధారణ ఉంటుందని మాల ధరించే వారు 9948283792 నంబర్‌కు సంప్రదించాలని వారు కోరారు.

బీజేపీ బూత్ కమిటీలు నియామకం

కట్టంగూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదులూరు గ్రామం లో శుక్రవారం బీజేపీ బూత్ కమిటీ సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా బూత్ కవిటీ ని పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గున్నాల నాగరాజు ప్రకటించారు. కమిటీ అధ్యక్షుడిగా సిరిపురం వెంకట్రాది, సభ్యులుగా ఆవుల అశోక్, పొన్న రమేష్, ఉబ్బని వెంకన్న, ఉట్కూర్ ఏడుకొండల్, అయితగోని శివను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు పబ్బు వెంకన్న, కోమటి భాస్కర్, బత్తిని నాగరాజు, జలేంద్రాచారి, యాదయ్య ఉన్నారు.

● నకిరేకల్ : బీజేపీ మండలాధ్యక్షుడు యానాల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో తాటికల్‌లో బూత్ కమిటీలకు నూతన అధ్యక్షులను నియమించారు. 244, 245, 246 వ బూత్ కమిటీ అధ్యక్షులుగా కారింగు శ్రీనివాసులు, చనగాని పెద్ద సైదులు, చనగాని చిన్న సైదులు నియమితులయ్యారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి చనగాని రాములు, జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి బండమీది శ్రీకాంత్, రమేష్, శ్రవణ్, జానయ్య, సాయిలు, లక్ష్మయ్య యా దయ్య పాల్గొన్నారు.

ప్రజల కోసం పనిచేసే వారే కమ్యూనిస్టులు

చిట్యాల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం కోసం పనిచేసేవారే కమ్యూనిస్టుని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య అన్నారు. చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని శివనేనిగూడెం మాజీ సర్పంచ్ నాగిళ్ల యాదయ్య వర్ధంతిని శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదయ్య సీపీఎం మండల నాయకుడిగా, ప్రజానాట్య మండలి కళాకారుడిగా ఎన్నో సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో జిట్ట సరోజ, పట్టణ కార్యదర్శి బొబ్బల సుధాకర్‌రెడ్డి, చొప్పరి మల్లేషం, జిట్ట స్వామి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

గట్టుప్పల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండంలోని వెల్మకన్నె గ్రామానికి చెందిన ఏర్పుల రాములు అనారోగ్యంతో మృతి చెందారు. కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రావుల రమేష్ తెలుసుకుని ఏర్పుల రాములు కుటుంబానికి రూ.5వేలుఅందజేశారు .కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, వెల్మకన్నె గ్రామశాఖ అధ్యక్షుడు నర్ మహమ్మద్, టేకుమట్ల శ్రీరాములు, బీమనపల్లి పెంటయ్య, యాదగిరి రెడ్డి, బీమనపల్లి యాదయ్య, యాదయ్య, పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి: ఆర్డీవో

కట్టంగూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని నల్లగొండ ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి అన్నారు. కట్టంగూరులోని తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ సెక్షన్లకు సంబంధించిన పెండింగ్ ఫైళ్లను పరిశీలించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అన్నారు. సమయపాలన పాటించాలని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, డీటీ సుకన్య, ఆర్ఐ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఫైళ్లను పరిశీలిస్తున్న ఆర్డీవో అశోక్‌రెడ్డి

కట్టంగూరు మండలానికి డైరెక్టర్ పదవులు

కట్టంగూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో కట్టంగూరు మండలానికి మూడు డైరెక్టర్ పదవులు దక్కాయి. మండలంలోని పరడా గ్రామానికి చెందిన పుట్ట నర్సింహ్మారెడ్డి, కట్టంగూరుకు చెందిన గుండు పరమేష్, పామనగుండ్లకు చెందిన బండారు క్రిష్ణలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా వారు తమ నియామకానికి సహకరించిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

నల్లగొండ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా నిర్వహించి, అర్హులైన వారిని గుర్తించి ఇళ్లను ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ సలీం, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నిరుపేదలు సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు ఎన్నో కలలు కంటున్నారని అన్నారు. ఇళ్ల వద్దకే సర్వే కోసం వస్తారని చెప్పడంతో ఎప్పుడు వస్తారో తెలియక వారి కోసం పడిగాపులు కాస్తున్నారని అన్నారు. ఈ మేరకు ప్రభుత్వం సర్వే నిర్వహించే అర్హులైన వారిని గుర్తించి ఇళ్లు కేటాయించాలని వారు కోరారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో రేషన్‌కార్డులను అందించకపోవడంతో రేషన్ కోసం పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబంలో ఉన్న రేషన్‌కార్డునే ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు తుమ్మల పద్మ, దండెంపల్లి సరోజ, గాదె నర్సింహ, కోట్ల అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలేజీలో సమస్యలను పరిష్కరించాలి



ఇంటర్‌బోర్డు కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న ఇస్మాయిల్

నార్కట్‌పల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో సమస్యలను పరిష్కరించాలని ఇంటర్ విద్యా ఫోరం అసోసియేషన్ అధ్యక్షుడు, నార్కట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ మహ్మద్ ఇస్మాయిల్ అన్నారు. కళాశాలల్లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం హైదరాబాద్‌లో ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్యను కలిసి వినతిపత్రం సమర్పించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కాలేజీల్లో నెలకొన్న సమస్యలను ఆయనకు వివరించారు. అదేవిధంగా నార్కట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీకి సొంత భవనం, కనీస వసతులు లేని పరిస్థితులను ఆయనకు వివరించినట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ బాలాజీ పాల్గొన్నారు.

ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి

రామగిరి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా ఉద్యోగస్తులకు ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంపల్లి భిక్షపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదావత్ లచ్చిరాం నాయక్ డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షా ఉద్యోగస్తులు చేపట్టిన నిరవధిక సమ్మెకు వారు సంఘీభావం తెలిపి మాట్లాడారు. సమస్యల పరిష్కరించాలని కోరుతూ మూడు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగస్తులను చర్చకు పిలిచి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం

యువత క్రీడల్లో రాణించాలి

● నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ● పలు మండలాల్లో సీఎం కప్ పోటీలు ప్రారంభం



ఎర్రసానిగూడెంలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరేశం



కనగల్: ఆటల పోటీలను ప్రారంభిస్తున్న తహసీల్దార్ పద్మ, ఎంపీడీవో జయరాం

కట్టంగూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించి తమ ప్రతిభను చాటుకోవాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని ఎర్రసానిగూడెం గ్రామంలో ఎంటీఆర్‌డీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. యువత క్రీడల్లో రాణించి రాష్ట్రస్థాయిలో నియోజకవర్గానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, మాజీ జడ్పీటీసీ మాద యాదగిరి, నాయకులు మిట్టపల్లి శివశంకర్, మర్రిరాజు, చెరుకు నర్సింహ, రెడ్డిపల్లి వీరస్వామి, అయితగోని నర్సింహ, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

గట్టుప్పల్: క్రీడలతోనే మానసికోల్లాసం లభిస్తుందని వెల్మకన్నె జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సుభాష్‌చందర్ అన్నారు. శుక్రవారం సీఎం కప్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారులను వెలికి తీయాలని అన్నారు. పోటీల్లో భాగంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలను నిర్వహించారు. అనంతరం క్రీడాకారులకు బహుమతులు అందజేశారు.

జిల్లా స్థాయి పోటీలకు 74 మంది ఎంపిక

కనగల్: కనగల్ మోడల్‌స్కూల్‌లో సీఎం కప్ మండలస్థాయి ఆటల పోటీలు విజయవంతంగా ముగిశాయి. పోటీలను తహసీల్దార్ బి.పద్మ, ఎంపీడీవో జయరాం, ఎంఈవో వి.పద్మ పోటీలను ప్రారంభించారు. పోటీల్లో మొత్తం 120 మంది యువతీ, యువకులు పాల్గొన్నారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపిన 74 మందిని ఈ నెల 16 నుంచి 18 తేదీ వరకు నల్లగొండ పట్టణంలోని మేకల అభినవ్ అవుట్‌డోర్ స్టేడియంలో జరిగే జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఇన్‌చార్జి భద్రయ్య, జగదీష్, పీడీలు విజయ్, శేఖర్, దర్మేందర్, సుధాకర్, రాజు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలి : మాజీ ఎమ్మెల్యే కిషోర్ కుమార్

శాలిగౌరారం డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. శాలిగౌరారం మాజీ ఉప సర్పంచ్ గోదల సురేష్‌రెడ్డి, గౌడ సంఘం నాయకులు నిమ్మల సురేష్ గౌడ్, చీమల శంకర్, సుంచు ముత్తయ్య, తాం దారి సతీష్, ఈర్ల సతీష్, మరో 10మంది మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ సమక్షంలో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కిషోర్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని అన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు ఐతగోని వెంకన్న గౌడ్, మాజీ అధ్యక్షుడు కట్ల వెంకట్‌రెడ్డి, నాయకులు మామిడి సర్వయ్య, గుండా శ్రీనివాస్, గుజలాల్ శేఖర్ బాబు, నాగరాజుగౌడ్, రూపని నాగరాజు, చినసైదులు, వీరసోములు, ఎస్ఐ బడేసాబ్, రమేష్, రాజు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే కిషోర్ కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న వివిధ పార్టీ నాయకులు

రేవంత్ సర్కారుకు రోజులు దగ్గరపడ్డాయి...

నల్లగొండ టౌన్ : మానవత్వం లేని రేవంత్ సర్కారుకు రోజులు దగ్గరపడ్డాయని మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్, కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశా కార్యకర్తలు ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో మోత్కూరుకు చెందని రహీంబీ అనే ఆశా కార్యకర్త పోలీసుల దాడిలో గాయపడింది. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆమె చికిత్స పొందుతుండగా శుక్రవారం పరామర్శించారు. యోగ క్షేమాలు తెలుసుకొని ఆర్థికసాయం అందించి భరోసా కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆడబిడ్డలను అవమానిస్తూ, దాడులు చేస్తూ, ఆశా కార్యకర్తలపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసిన దాడికి తగిన మూల్యం చెల్లిం చుకోక తప్పదని హెచ్చరించారు. సమస్యల పరిష్కారానికి ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలపై పోలీసులు కర్కశంగా వ్యవహరించడం దారుణమని అన్నారు. వారివెంట బీఆర్ఎస్ నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, బోనగిరి దేవేందర్ తదితరులు ఉన్నారు.

ప్రపంచశాంతి కోసం అవతరించిన క్రీస్తు

● మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు

నల్లగొండటౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ శాంతి కోసం లోకరక్షకుడైన ఏసుక్రీస్తు లోకంలో అవతరించాడని మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో సియాన్ యూత్, గ్లోబల్ క్రిస్టియన్ ఎంపవర్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ కంటాట సెమీక్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. నల్లగొండలోక్రిస్మస్ కంటాట ప్రదర్శనను నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి పంచి పెట్టారు. క్రిస్మస్ పర్వదినాన్ని వివరిస్తూ కళాకారులతో నిర్వహించిన ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో సియాన్ యూత్ సభ్యులు ప్రేమ్, ప్రదీప్, ప్రవీణ్, ప్రేమ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు రేఖల భద్రాద్రి, పాస్టర్లు ఐజాక్ రామ్, మోజెస్, సమర్పన్ కుమార్, డేవిడ్ రాజు, క్రిస్మస్ కాంటాట సభ్యులు హిమచంద్, సురేష్ కళాకారులు పాల్గొన్నారు.



వేడకల్లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు

16న చలో అసెంబ్లీని విజయవంతం చేయాలి

నకిరేకల్, డిసెంబరు 13, (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని అన్ని ప్రభుత్వ శాఖలలో ఖాళీ గా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16న నిర్వహించే చలో అసెంబ్లీని విజయవంతం చేయాలని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మా మిడోజు వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ చారి పిలుపునిచ్చారు. నకిరేకల్ పట్టణంలోని యానాల మల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జరిగిన పీవైఎల్ సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య రోజు రోజుకు తీవ్రతరం అవతుందని, నిరుద్యోగుల సమస్య పరిష్కారం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో బండారు వెంకన్న, పిట్టల అనిల్, సీహెచ్ సైదులు, వీరాంజనేయులు, సతీష్ పాల్గొన్నారు.

ధర్మాగ్రహ దీక్షను విజయవంతం చేయాలి

కట్టంగూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో పెండింగ్ డీఏలు, పీఆర్సీ సాధన కోసం ఈ నెల 17న ఇందిరాపార్కు వద్ద నిర్వహించే ధర్మాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని కోరుతూ ఉపాధ్యాయులు శుక్రవారం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో అంబటి అంజయ్య, ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిని భాస్కర్‌గౌడ్, కట్టంగూరు మండలశాఖ అధ్యక్షులు పాండరి, కట్టంగూరు, కేతేపల్లి, శాలిగౌరారం మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో వానరం మృతి

చిట్యాల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్‌లో శుక్రవారం కుక్కల దాడిలో వానరం మృతి చెందింది. కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన వానరానికి చికిత్స అందించినప్పటికీ మృతి చెందింది. మృతి చెందిన వానరానికి స్థానిక మున్సిపల్ సిబ్బంది డప్పు చప్పుళ్లతో అంత్యక్రియలు నిర్వహించారు.

గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

(5వ పేజీ తరువాయి)

సరఫరా ఉండేలా ట్రాన్స్‌కో ఎస్ఈని ఆదేశించాం. అదేవిధంగా ప్రతీ కేంద్రం వద్ద ఆరోగ్యసిబ్బందితో పాటు, అత్యవసరవైద్యానికి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వోకు సూచించాం. ఈ రెండు రోజుల పాటు అభ్యర్థులకు ఇబ్బందుల్లేకుండా ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నాం.

● ఈనెల 15, 16 తేదీల్లో ప్రతి రోజూ రెండు సెషన్లుగా పరీక్షలు జరుగుతాయి. ఉదయం 10 నుంచి 12.30గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 3 నుంచి 5.30గంటల వరకు రెండో సెషన్ పరీక్షలు జరుగుతాయి.


● ప్రతీ అభ్యర్థి ముందురోజే పరీక్షా కేంద్రాన్ని సరిచూసుకోవాలి. పరీక్షల రోజు ఉదయం 8.30గంటల నుంచే అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతిస్తారు. ప్రతీ అభ్యర్థి బయోమెట్రిక్ హాజరును 9గంటల నుంచి తీసుకుంటారు. అందుకే అభ్యర్థులంతా 8.30గంటల లోపే కేంద్రాల వద్దకు చేరుకోవాలి. మధ్యాహ్నం సైతం గంటన్నర ముందుగానే కేంద్రానికి చేరుకుంటే ప్రశాంతంగా పరీక్ష రాయవచ్చు. చివరి నిమిషం వరకు వేచి ఉండి హడావిడి పడకుండా ముందుగానే కేంద్రాల వద్దకు చేరుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలి. అభ్యర్థులు చెప్పులు మాత్రమే ధరించి రావాలి. షూ వేసుకోకూడదు.

● అభ్యర్థులెవరూ ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, కాలిక్యులేటర్లు, ఎలక్ట్రానిక్ గడియారాలు, సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు, రికార్డింగ్ సాధనాల వంటి పరికరాలేవీ పరీక్షా కేంద్రంలోకి తీసుకురాకూడదు. పరీక్షా కేంద్రాల వద్ద మెటల్‌డిటెక్టర్ ద్వారా పరీక్షించిన తర్వాతే అభ్యర్థులను లోనికి అనుమతిస్తారు. సీసీ కెమెరా పర్యవేక్షణ ఉంటుంది. నలుపు, నీలం బాల్‌పాయింట్ పెన్నులు, ఫొటో అతికించిన హాల్‌టిక్కెట్, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా చెల్లుబాటయ్యే ఒరిజినల్ గుర్తింపు కార్డు మాత్రమే పరీక్షహాల్‌లోకి అనుమతిస్తారు. హాల్‌టిక్కెట్‌పై అభ్యర్థిపై ఫొటో, సంతకం స్పష్టంగా కనిపించేలా ఉంటేనే హాల్‌టిక్కెట్‌ని అనుమతిస్తారు. లేజర్‌ప్రింటర్, ఏ4 సైజ్ కాగితంపై ముద్రించిన హాల్‌టిక్కెట్ తీసుకురావాలి. హాల్‌టిక్కెట్‌లో నిర్దేశిత స్థలంలో ఇటీవలి పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోను అతికించాలి. లేకపోతే హాల్‌టిక్కెట్ తిరస్కరణకు గురవుతుంది.

నిలకడగా గురుకుల పాఠశాల విద్యార్థి ఆరోగ్యం

కేతేపల్లి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మూసీ గురుకుల పాఠశాల విద్యార్థి నీలం సాయిగణేష్ ఆరోగ్యం నిలకడగా ఉంది. పాఠశాలకు చెందిన ఆరో తరగతి విద్యార్థి నీలం సాయిగణేష్ వాష్‌రూంకు వెళ్లి తిరిగి వచ్చే సమయంలో కాలు నుంచి రక్తం వస్తుండడంతో పాము కరిచిందనే అనుమానంతో గురువారం సాయంత్రం నకిరేకల్, అనంతరం నల్లగొండ జిల్లా కేంద్రాస్పత్రితకి తరలించిన విషయం విదితమే. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకునేందుకు య త్నిస్తే పాఠశాల ప్రిన్సిపాల్ ధనమ్మ శుక్రవారం రెండో రోజు సైతం ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు. ఈ క్రమంలో బాధితుడి వద్ద ఆసుపత్రిలో ఉన్న మేనబావ బంటు శివ ద్వారా తెలిసిన వివరాలు ఇలా ఉన్నాయి. అయిటిపాములకు చెందిన నీలం యాదగిరి, జానకమ్మల కుమారుడు సాయిగణేష్‌ను మూసీ పాఠశాలలో చేర్పించి కల్లు గీత వృత్తిరీత్యా ఒడిశాకు వలస వెళ్లారు. పాఠశాలలో ఉన్న సాయిగణేష్‌ను ఆసుపత్రిలో చేర్పించిన విషయం తెలిసి నాయనమ్మ, మేన బావ శివ నల్లగొండ ఆసుపత్రికి చేరుకున్నారు. అక్కడి వైద్యులు సాయిగణేష్‌కు పాముకాటు విరుగుడు ఇంజక్షన్లు వేయడంతో శరీరంపై దద్దుర్లు వచ్చాయి. దీంతో సాయిగణేష్ నాయనమ్మ, మేనబావ శివలు శుక్రవారం రాత్రి నల్లగొండ ఆసుపత్రి నుంచి హైదరాబాద్ నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత విద్యార్థి సాయిగణేష్ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు శివ తెలిపాడు. పాఠశాల ప్రిన్సిపాల్ సైతం తమ వెంటే ఆసుపత్రిలో శుక్రవారం సాయంత్రం వరకు ఉందని తెలిపాడు. సాయిగణేష్ పాఠశాల బాత్‌రూంకు వెళితే అప్పటికే బాత్‌రూం తలుపు వెంట ఉన్న పామును చూసి గాబరా పడ్డాడని, పరిగెత్తే క్రమంలో పట్టుతప్పి కిందపడటంతో కాలికి రక్త గాయమైనట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
***
ANDHRAJYOTHY



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.127	208	238
సూర్యాపేట	రూ.125	190	210
నల్లగొండ	రూ.130	190	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 28.2 । కనిష్ఠం 21.0

గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు

పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లాలో 87 కేంద్రాల్లో పరీక్ష
- హాజరుకానున్న 29,118 మంది అభ్యర్థులు
- టీజీపీఎస్సీ అనుమతించిన మేరకు స్క్రైబ్స్‌కు అనుమతి
- అభ్యర్థులు ప్రశాంతంగా పరీక్ష రాసేలా ఏర్పాట్లు
- అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్



జిల్లాలో ఈనెల 15, 16 తేదీల్లో గ్రూప్-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నాం.. అభ్యర్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేశాం.. అని అదనపు కలెక్టర్(రెవెన్యూ), గ్రూప్-2 పరీక్షల నోడల్ అధికారి జె.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో గ్రూప్-2 పరీక్షల ఏర్పాట్లు,తదితర విషయాలను ఆయన ఇలా వివరించారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

జిల్లాలో నల్లగొండ, మిర్యాలగూడ పట్టణాల్లోని 87 పరీక్షా కేంద్రాల్లో గ్రూప్-2 నిర్వహిస్తున్నాం. నల్లగొండలో 59, మిర్యాలగూడలో 28 కేంద్రాలు ఏర్పాటు చేశాం. మొత్తం 29,118 మంది అభ్యర్థులు ఈ కేంద్రాల్లో పరీక్ష రాయనున్నారు. నల్లగొండలో 21, 777మంది,మిర్యాలగూడలో 7,941 మంది పరీక్షకు హాజరుకానున్నారు. ప్రశ్న పత్రాల కోసం మొత్తం మూడు స్ట్రాంగ్ రూములు ఏర్పాటు చేశాం. పరీక్షల రోజు ఉదయం పోలీసు బందోబస్తు నడుమ పేపర్లను స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి కేంద్రాలకు పంపిస్తాం.

రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనల మేరకు పోలీస్‌శాఖ నుంచి అదనపు ఎస్పీతో కలిసి మేం పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాట్లు, బందోబస్తు, పరీక్షల నిర్వహణపై కార్యాచరణ రూపొందించాం. జిల్లాలో ముగ్గురు రీజనల్ కోఆర్డినేటర్లను నియమించాం. వారితో పాటు 99మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 31 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 17 మంది జాయింట్ రూట్ ఆఫీసర్లు, 31 మంది అబ్జర్వర్లను, 244 మంది ఐటెండిఫికేషన్ అధికారులను నియమించాం.

కమిషన్ అనుమతి మేరకు జిల్లాలో 82మంది దివ్యాంగ అభ్యర్థులకు ప్రత్యేక సదుపాయాలు అందుబాటులో ఉంచాం.స్క్రైబ్ లేక పరిహార సమయానికి అర్హులని హాల్‌టిక్కెట్‌పై ముద్రించి ఉంటుంది. వారు తప్పనిసరిగా సదరం సర్టిఫికెట్‌ను పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌కు చూపాలి.టీజీపీఎస్సీ అనుమతించినవారికే స్క్రైబ్ నియామకం జరుగుతుంది. వారిని గుర్తించిన తర్వాతే కేంద్రాల్లోకి అనుమతిస్తారు.

ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద పటిష్ఠ పోలీసుబందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. పరీక్షలు జరిగే రెండు రోజులు, నాలుగు సెషన్లలో కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. పరీక్షా కేంద్రాలన్నీ సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణలో ఉంటాయి. కాబట్టి కేంద్రాల వద్ద ఈ రెండు రోజులు పరీక్ష జరిగే సమయంలో విద్యుత్ నిరంతర

- మిగతా 8వ పేజీలో...



ఆదర్శ ఉపాధ్యాయుల

నిరసన బాట

- ఉద్యోగభద్రత కోసం ఆందోళనలు
- జనవరి 4న హైదరాబాద్‌లో మహాధర్నా
- పాఠశాల విద్యాశాఖలో విలీనం చేయాలని డిమాండ్

న్యాయమైన కోర్కెలు తీర్చాలనే డిమాండ్‌తో ఆదర్శపాఠశాలల ఉపాధ్యాయులు దశలవారీగా ఆందోళన నిర్వహిస్తున్నారు. పదేళ్ల క్రితం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ విధానంలో నియమితులైన వీరు ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 194 మోడల్ స్కూళ్లలో 2,900 మంది ఉపాధ్యాయులు వారి హక్కుల కోసం ఉద్యమబాట పట్టారు. పదేళ్ల నుంచి కనీస ఉద్యోగభద్రత లేకుండా కొనసాగుతున్న వీరు ప్రభుత్వం సానుకూలదృక్పథంలో పరిష్కరించాలని కోరుతున్నారు. ప్రభుత్వం స్పందించకుంటే జనవరి 4న హైదరాబాద్‌లో ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్టు ప్రోగ్రెసివ్ మోడల్ స్కూల్స్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

యూపీఏ ప్రభుత్వహయంలో 2012లో మోడల్ స్కూళ్లు ఏర్పాటయ్యాయి. స్కూళ్ల నిర్మాణాలు పూర్తయ్యాక 2013లో నోటిఫికేషన్ ద్వారా ఉపాధ్యాయుల నియామకాలు చేశారు. 2013లో కొందరికి, 2014లో మరి కొందరికి సాంకేతికకారణాలతో వేర్వేరు గా నియామక ఉత్తర్వులు ఇచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 11 ఏళ్లు ఎలాంటి పదోన్నతులు, ఉద్యోగభద్రత లేకుండా మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరితో పాటే అదే సమయంలో ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న సమయం లో ఏపీలో నియమితులైన మోడల్ స్కూల్ టీచర్లను పాఠశాల విద్యాశాఖలో విలీనం చేసి 010 పద్దు కింద వేతనాలిస్తున్నారు. ఇక్కడ కూడా అదే తరహాలో పాఠశాల విద్యాశాఖలో విలీనం చేసి 010 పద్దు కింద వేతనాలివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మోడల్ స్కూల్ టీచర్లుగా ఒకే నోటిఫికేషన్ కింద నియమించినప్పటికీ, రెండోదశలో నియమితులైన వారికి కూడా నోషనల్ సర్వీస్, నోషనల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. హెల్త్‌కార్డులు అందజేయాలని కోరుతున్నారు. వేర్వేరు కారణాలతో ఈ11 ఏళ్ల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 38మంది మృతిచెందగా, వారి స్థానంలో వారి కుటుంబీకులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలివ్వాలని, వారికి సంబంధించిన సీపీఎస్‌డెత్ గ్రాట్యుటీ,ఫ్యామిలీ పింఛన్ వెంటనే అందించాలని డిమాండ్ చేస్తున్నారు. 11 ఏళ్లుగా పదోన్నతులు లేవని, వెంటనే పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని కోరుతున్నారు. పెండింగ్ బకాయిల తక్షణం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు

బోధనకు ఆటంకం కలగకుండా డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా...

- మిగతా 6వ పేజీలో...



హుజూర్‌నగర్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



చింతలపాలెంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

మేళ్లచెర్వు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని భారీ నీటిపారుదల శాఖ, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గంలో శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు మంత్రి వచ్చారు. సమయాభావంతో రూ.10కోట్లతో చౌటపల్లి నుంచి మేళ్లచెర్వు వరకు ఏడు కిలోమీటర్ల డబుల్ రోడ్డు, రూ.26కోట్లతో లింగగిరి నుంచి కల్మల్ చెరువు వరకు 13కిలోమీటర్ల డబుల్ రోడ్డు, రూ.23కోట్లతో అమరవరం నుంచి అలింగపురం వరకు 11.50కిలోమీటర్ల డబుల్ రోడ్లకు శంకుస్థాపన చేయాల్సి ఉన్నప్పటికీ, సమయంలేనందున మరోసారి వస్తానన్నారు.

చింతలపాలెం మండల కేంద్రం నుంచి వయా రేవూరు మీదుగా మేళ్లచెర్వు మండ లం రామాపురం వరకు రూ.20కోట్ల వ్యయంతో నిర్మించనున్న 10 కిలోమీటర్ల రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషిచేస్తున్నామని, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో ఒక సంవత్సరం కాలంలోనే కేవలం రోడ్ల నిర్మాణం కోసం రూ. 500కోట్లు ఖర్చు చేశామని, నియోజకవర్గాల్లో సాగు, తాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యం, విద్యుత్, మౌలిక సదుపాయాల కోసం కృషిచేస్తున్నామని, నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని, పక్కా గృహాలు, ఎత్తిపోతల పథకాలతో నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మంత్రి ఉత్తమ్ అన్నారు. సభ ముగిసిన అనంతరం సభా వేదిక నుంచి హెలిప్యాడ్ వరకు ఓపెన్ టాప్ జీబులో ప్రజలకు అభివాదం చేస్తూ వెళ్లారు. మంత్రి ఉత్తమ్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ తిరుగు ప్రయాణంలో టేకాఫ్ సమయంలో సాంకేతికత సమస్యలతో మొరాయించింది. ఆతరువాత టేకాఫ్ అయింది.



ధనుర్మాసం.. తిరుప్పావై వ్రతం

- 30 రోజుల పాటు పాశురాల పఠనం
- ఉదయం కైంకర్య వేళల్లో మార్పులు

7



యాదగిరిగుట్ట మండలం కాచారంలో విద్యార్థినితో మాట్లాడుతున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

చదువుకు పేదరికం అడ్డుకాదు

- ఉల్లిగడ్డలమ్మి అమ్మ నన్ను చదివించింది
- దేశం అభివృద్ధి చెందాలంటే విద్యతోనే సాధ్యం
- విద్యతోపాటు సంస్కారం అలవర్చుకోవాలి
- హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ
- యాదగిరిగుట్ట మండలం కాచారంలో విద్యార్థులతో మాటాముచ్చట

7

చిన్న తప్పు.. పెద్దముప్పు

6



డంపింగ్ యార్డుల ద్వారా వర్మీకంపోస్టు

కలెక్టర్ ఇలాత్రిపాఠి



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కలెక్టర్

నల్లగొండ టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): డంపింగ్ యార్డుల ద్వారా సాధ్యమైనంత ఎక్కువ వర్మీకంపోస్టు తయారీకి కృషి చేయాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. అందుకు నూరుశాతం తడి, పొడి చెత్తలను సేకరించాలన్నారు. శుక్రవారం నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని చందనపల్లిలోని డంపింగ్ యార్డును ఆమె పరిశీలించారు. డంపింగ్ యార్డుతో తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, ఎప్పటికప్పుడు వర్మీకంపోస్టు తయారుపై దృష్టి సారించాలన్నారు. డంపింగ్ యార్డు పక్కనే ఉన్న స్థలంలో కబేళా ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. అనంతరం శేషమ్మగూడలో ఉన్న సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను తనిఖీ చేశారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో అశోక్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, తహసీల్దార్ శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

పెంచిన డైట్ చార్జీలను ప్రదర్శించాలి

ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు పెంచిన డైట్ చార్జీలను ఈనెల 14న ప్రారంభిస్తున్న నేపథ్యంలో వాటి వివరాలను ప్రతీ రెసిడెన్షియల్ పాఠశాల, కేజీబీవీ హాస్టళ్లలో అందరికీ కనిపించేలా ఫ్లెక్సీలను ప్రదర్శించాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆదేశించారు. శుక్రవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం ఇటీవల 40శాతం డైట్ చార్జీలు పెంచిందన్నారు. మెనూలో సైతం కొన్ని మార్పులు తెచ్చిందని, కాస్మెటిక్ చార్జీలు సైతం పెంచిందన్నారు. జిల్లాలో 204 రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయని, ఈనెల 14న డైట్ చార్జీల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని, దీనికి విద్యార్థుల తల్లిదండ్రులను తప్పనిసరిగా ఆహ్వానించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొన్ని మండలాల్లో ముమ్మరంగా సాగుతోందని ఆయా మండలాల అధికారులను అభినందించారు. సర్వేను ఎలాంటి తప్పులు లేకుండా ఇలాగే కొనసాగించాలన్నారు. ఈ నెల 15, 16 తేదీల్లో గ్రూప్-2 పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా విజయవంతంగా నిర్వహించాలన్నారు. అనంతరం సమగ్ర ఇంటింటి సర్వేను సమీక్షించారు.

విద్యుత్ రంగాన్ని ఉద్యమాలతో కాపాడుకుంటాం

టీజీపీఈజేఏసీ చైర్మన్ వెంకటయ్య



నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

నల్లగొండ టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగాన్ని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు విక్రయించే యత్నానికి స్వస్తి పలకాలని, లేదంటే ఉద్యమాలు, మెరుపు సమ్మెలతో కాపాడుకుంటామని టీజీపీఈజేఏసీ చైర్మన్ ఎస్.వెంకటయ్య టీజీపీఈఏ నేత, డీఈ నవీద్ అహ్మద్ అన్నారు. ప్రైవేటీకరణ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు శుక్రవారం సర్కిల్ కార్యాలయం ఎదుట విద్యుత్ ఉద్యోగులు నిరస న తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులంతా ఐక్యతతో సంస్థ రక్షణకు కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ విద్యుత్ ప్రైవేటీకరణ విధానాలను ఐక్యంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఇటీవల ఉత్తరప్రదేశ్, చండీఘడ్ విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారంచుట్టిందని, దీన్ని నిరసిస్తూ ఆయా రాష్ట్ర విద్యుత్ ఉద్యోగులు ప్రాణాలకు తెగించి ఉద్యమించారన్నారు. వారికి బాసటగా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల విద్యుత్ ఉద్యోగులు సంపూర్ణ మద్దతు తెలిపామన్నారు. అదే స్ఫూర్తి భవిష్యత్తులో కూడా సాగాలన్నారు. కార్యక్రమంలో ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు శంకర్, అన్నయ్య, వివిధ సంఘాల నాయకులు రవికుమార్, రాంబాబు, విశ్వం, గంజి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షా కేంద్రాల వద్ద

పటిష్ఠ భద్రత

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



నల్లగొండ టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 15, 16న రెండు రోజులు పాటు జరిగే గ్రూప్-2 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎస్పీ శరత్‌చంద్రపవార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు 29,118మంది అభ్యర్థులు హాజరవుతున్నారని, అందుకు నల్లగొండలో 59, మిర్యాలగూడ పట్టణంలో 28, మొత్తం 87 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. నల్లగొండలో 21,777 మంది, మిర్యాలగూడలో 7,941 మంది మొత్తం 29,118 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. కేంద్రాల వద్ద ఉదయం 6 నుంచి సాయంత్రం 8 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్, ఇంటర్‌నెట్ సెంటర్లను బంద్ చేయాలని, లౌడ్ స్పీకర్లు మోగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా కేంద్రం నుంచి 500 మీటర్ల వరకు ప్రజలు గుమికూడవద్దన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టికెట్‌లో పొందుపరిచిన విధంగా సమయానికి చేరుకోవాలన్నారు. అభ్యర్థులు పరీక్షా హాల్‌లోకి సెల్ ఫోన్లు, ట్యాబ్, పెన్ డ్రైవ్, బ్లూటూత్, ఎలక్ట్రానిక్ వాచ్, కాలిక్యులేటర్లు, వాలెట్లు వంటివి తీసుకువెళ్లడానికి అనుమతి ఉండదని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రంలోకి వెళ్లేముందే ప్రధాన గేటు వద్ద తనిఖీలు నిర్వహించే పోలీసులకు అభ్యర్థులు సహకరించాలని పేర్కొన్నారు.

పార్టీ బలోపేతానికి బూత్ కమిటీలే కీలకం

బీజేపీ సంఘటన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్ తివారి

నల్లగొండ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతం కావాలంటే గ్రామాల్లో బూత్ కమిటీలే కీలకమని బీజేపీ సంస్థాగత విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారి అన్నారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సంస్థగత ఎన్నికలపై సమీక్షా సమావేశం, సంఘటన్ పర్వ్‌లో ఆయన మాట్లాడారు. ఈనెల 17వ తేదీ వరకు జిల్లాలో బూత్ కమిటీల ఎన్నికలు నిర్వహించాలన్నారు. సంస్థగత ఎన్నికలు నిర్వహించుకునే ప్రక్రియ బీజేపీలో పారదర్శకంగా ఉంటుందన్నారు. కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తకు అవకాశాలు దక్కుతాయన్నారు. కమిటీలు నిర్వహించిన అనంతరం ఈ నెల 22, 23 తేదీల్లో మండల అధ్యక్షుల నియామకాలు జరగాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు, మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, కన్వంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, కల్యాణ్ నాయక్, తోటపల్లి రవికుమార్ పాల్గొన్నారు.

రైతుల అరెస్టుకు నిరసనగా సీఎం దిష్టిబొమ్మ దహనం

రైతుల అరెస్టుకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ, రైతు భరోసా గురించి ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు హంతకుడిలా బేడీలు వేయడం అమానుషమని అన్నారు. రైతులకు అండగా బీజేపీ నిరంతరం పోరాడుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు పిల్లి రామరాజు, పోతెపాక సాంబయ్య, లోకనబోయిన రమణముదిరాజ్, విద్యాసాగర్ రెడ్డి, మిర్యాల వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

మురుగు పారేదెలా..?

▸ పూడిపోతున్న నాలాలు ▸ కౌన్సిల్ తీర్మానించినా.. పనవ్వలేదు ▸ పూడికతీత పనుల నిర్వహణలో నిర్లక్ష్యం

మిర్యాలగూడ పట్టణంలోని ప్రధాన నాలాలు పూడిక, చెత్తతో నిండి దుర్గంధం వెలువడుతుంది. పలు నాలాల్లో చెట్లు విపరీతంగా పెరగడంతో మురుగునీరు వెళ్లడం లేదు. దీంతో కాల్వలు నిండి వీధుల్లో పారుతున్నాయి. పట్టణంలోని రైల్వేకాలనీ నుంచి అశోక్‌నగర్, హనుమాన్‌పేట, రెడ్డికాలనీ, ముత్తిరెడ్డికుంట, సుందర్‌నగర్, హరిజనవాడ మీదుగా చిన్న చెరువులోకి ఒక నాలా ప్రవహిస్తుండగా, నందిపాడు. బంగారుగడ్డ, సీతారాంపురం, షాబూనగర్ కాలనీల నుంచి మరో నాలా పారుతోంది. అయితే నాలాల్లో వ్యర్థాలు నిండిపోగా అక్కడక్కడా మొలచిన మొక్కలు చెట్లు, వృక్షాలుగా ఎదుగుతున్నాయి. నాలాల్లో వ్యర్థాలను తొలగించి పారిశుధ్యం మెరుగుపరచాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పట్టణ ప్రజలు వాపోతున్నారు.

- (ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ టౌన్)





అడవిని తలపిస్తున్న పట్టణంలోని సుందర్‌నగర్ సమీపంలో నాలా

పట్టణంలో పారిశుధ్య సమస్య తీవ్రంగా మారింది. వ్యాపార సంస్థల నుంచి వెలువడే వ్యర్థాలను నేరుగా నాలాల్లో పడవేస్తుండటంతో సమస్య తీవ్రమవుతున్నది. కొందరు వ్యాపారులు దుకాణాల్లోని వ్యర్థాలను బస్తాలు, మూటలు రాత్రి సమయంలో తీసుకువచ్చి కాల్వల్లో వేస్తున్నారు. దీంతో మురుగునీరు నిలిచి దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతున్నాయని, పందుల బెడద అధికంగా మారింది. ఒక్కో సందర్భంలో జంతు కళేబరాలు కొట్టుకొచ్చి చెట్ల పొదల్లో నిలుస్తున్నాయి. దీంతో తీవ్ర దుర్గంధం వెలువడుతుండటంతో నాలాల సమీపంలో నివసించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నాలాలు పూడిక, చెత్త, చెట్లతో నిండి ఉండటంతో వర్షాలు కురిసిన తరుణంలో వరద నీరు పారక వీధులు, కాలనీల్లోకి వచ్చి చేరుతుంది.

కౌన్సిల్ తీర్మానించినా..!

జూలై నెలలో జరిగిన మునిసిపల్ సమావేశంలో నాలాల పూడికతీత పనులు చేపట్టాలని కౌన్సిల్ తీర్మానించింది. అందుకు అవసరమైన టెండర్లు వెనువెంటనే పిలవాలని కౌన్సిల్ తీర్మానించింది.

అయితే కౌన్సిల్ తీర్మానం పొంది ఐదున్నర నెలలు గడుస్తున్నా.. టెండర్ పిలవకపోవడం, పనులు చేపట్టకపోవడంపై పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పూడికతీత పనులు చేపట్టాలి



పట్టణంలోని ప్రధాన మురగు కాల్వలు వ్యర్థాలు, చెట్లతో నిండి ఉన్నాయి. ముఖ్యంగా నాలాల్లో పూడికతీత పనులు చేపట్టని కారణంగా పిచ్చిచెట్లు పెరిగి మురుగునీరు పారడం లేదు. దోమలు, ఈగలు వ్యాపించడంతో పాటు తీవ్రమైన దుర్వాసన వస్తోంది. పట్టణ నడిబొడ్డు నుంచి నాలాలు ప్రవహిస్తున్న కారణంగా పలు కాలనీల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నాలాల వెంట తిరిగే చిన్నారులు విషజ్వరాల బారిన పడుతున్నారు. నాలాల్లో పూడికతీత పనులు వెంటనే చేపట్టాలి.

- గోరంట్ల రంగరాజు, పట్టణ వాసి

త్వరలో టెండర్లు పిలుస్తాం



పట్టణ అభివృద్ధి భాగంగా ప్రధానంగా పారిశుధ్య వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతున్నాం. అందుకు ప్రజల సహకారం అవసరం. ఇంటింటికి తిరిగి చెత్తను సేకరిస్తున్నా కొందరు వ్యర్థాలను నాలాలలో పడవేస్తున్నారు. అలా చేయడం సరికాదు. నాలాల్లో పూడికతీత పనులు నిర్వహించేందుకు త్వరలో టెండర్లు ఆహ్వానిస్తాం.

- ఎండీ. యూసుఫ్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ

పోటీల్లో ప్రతిభ చాటాలి

మాడ్గులపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు పోటీల్లో ప్రతిభ చాటాలని ఎంపీడీవో తిరుమలస్వామి అన్నారు. మండల కేంద్రంలోని సెవెంత్ డే ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండలస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మండల స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో పలువురు క్రీడాకారులు పాల్గొని ప్రతిభ చాటారు. ఉత్తమ ప్రతిభ చాటిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో తిరుమలస్వామి



కొండభీమనపల్లిలో వన నర్సరీని పరిశీలించి మాట్లాడుతున్న డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి

నర్సరీల్లో మొక్కలను పెంచి సంరక్షించాలి

● డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి

దేవరకొండ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ మండలంలోని 39 నర్సరీల్లో మొక్కలను పెంచి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. దేవరకొండ మండలం కొండభీమనపల్లిలో శుక్రవారం నర్సరీని పరిశీలించి మాట్లాడారు. బ్యాగుల్లో నాణ్యమైన మట్టిని నింపి వివిధరకాల మొక్కలను పెంచాలని ఆయన సూచించారు. మండలంలో 2.11లక్షల మొక్కలను నాటడమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది మొక్కలు ఎండిపోకుండా సంరక్షించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో డానియెల్, ఉపాధి హామీ ఏపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

బాలికల విద్యాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



కేజీబీవీ పాఠశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే పేద బాలికలకు మెరుగైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని ఆలగడప గ్రామంలో శుక్రవారం రూ.3.25కోట్లతో నూతనంగా నిర్మించనున్న కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల భవన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేద, మధ్య తరగతి బాలికలకు మెరుగైన ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో కేజీబీవీ పాఠశాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పేద, మధ్య తరగతి విద్యార్థినులకు మెరుగైన వసతులతో కూడిన విద్యను అందించేందుకు కేజీబీవీ, మోడల్, రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచినట్లు ఆయన తెలిపారు. ఆడబిడ్డ చదువు ఒక కుటుంబానికే కాదని సమాజం మొత్తాన్ని ప్రభావితం చేస్తుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలోపు పాఠశాల భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిబాబు, ఎంఈవో బాలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

దామరచర్ల, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎస్‌కె.కరీమున్నీసా, సీఐటీయూ మండల కన్వీనర్ భైరం దయానంద్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కార్మికుల వేతనాలతో పాటు కోడిగుడ్ల బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు సబ్సిడీపై గ్యాస్ కనెక్షన్లు, కొత్త వంట పాత్రలను అందించాలని, కార్మికులకు బీమా పథకం, ఈఎస్ఐ, పీఎఫ్ వంటివి వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 16, 17 తేదీల్లో 48 గంటల పాటు నల్లగొండ కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాలో మధ్యాహ్న భోజన కార్మికులందరు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు మల్లాల లక్ష్మమ్మ, శాంతమ్మ, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

010 ద్వారా వేతనాలు చెల్లించాలి

దామరచర్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు ప్రభుత్వం 010 పద్దు ద్వారా వేతనాలను చెల్లించాలని ప్రోగ్రెసివ్ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (పీఎంటీఏటీఎస్) సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.బాబ్లానాయక్ అన్నారు. మండలంలోని బొత్తలపాలెం మోడల్ స్కూల్‌లో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 010 పద్దు ద్వారా జీతాలు చెల్లించాలని, నేషనల్ సర్వీస్‌కు కల్పించాలని, హెల్త్‌కార్డులను అందించాలని కోరారు. కార్యక్రమంలో మందుల అశోక్‌కుమార్, కంభం సైదిరెడ్డి, సోమలింగం, పోతురాజు నరహరి, హుస్సేన్, భాస్కర్‌రెడ్డి, రామలక్ష్మణ్‌రావు, శ్రీనునాయక్, ప్రసాద్, రవికాంత్, విద్యాసాగర్, సమీనా, సతీష్, శ్రవణ్, రహీం, దుర్గ పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి : ఎమ్మెల్యే

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 13: ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో సీఎం కప్ పోటీలను ఆయన ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్ క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ ఆటలతో ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, అందుకే రాష్ట్రవ్యాప్తంగా క్రీడోత్సవాలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో లావూరి బాలు, హెచ్‌ఎం ధర్మానాయక్, పీఈటీలు సైదులు, వెంకరత్నం, వేణుగోపాల్ రెడ్డి, రవినాయక్, శ్రీను, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌ను పీఎం చేయడమే లక్ష్యం



ఎమ్మెల్యే బాలునాయక్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న గుడిపల్లికి చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు

● ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

దేవరకొండ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిగా చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం గుడిపల్లి మండలానికి చెందిన బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు సురబోయిన రమేష్, కార్యదర్శి శ్రీను, బీజేపీ సీనియర్ నాయకుడు బూతం యాదగిరి, వార్డు సభ్యుడు అంజనేయులుతో పాటు 50 మంది నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే బాలునాయక్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తున్నట్లు తెలిపారు. డిండి ఎత్తిపోతల, శ్రీశైలం సొరంగమార్గం, నక్కలగండి, ఎస్ఎల్‌బీసీ ఓపెన్‌కెనాల్ ప్రాజెక్టులను పూర్తిచేసి అన్ని గ్రామాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.

అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం

దేవరకొండ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తానని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండ మండలంలోని తాటికోలు నుంచి కొమేపల్లి వయా గొల్లపల్లి మీదుగా నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు రూ.2.40 కోట్లతో రెండున్నర కిలోమీటర్ల మేర రోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. నాణ్యతాప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి కుక్కల గోవర్ధన్‌రెడ్డి, పీఏపల్లి మండల అధ్యక్షుడు ఎల్లయ్య యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోడియానాయక్, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్మటి సతీష్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ అరుణ సురేష్‌గౌడ్, మాజీ ఎంపీపీ జాన్‌యాదవ్, మాజీ సర్పంచ్ జూలూరి ధనలక్ష్మీ బాలనారాయణగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లోకసాని శ్రీధర్‌రెడ్డి, తిప్పర్తి రుక్మారెడ్డి, నాగార్జునరెడ్డి, రవి, కాటంగౌడ్, ఎంపీడీవో డానియెల్, పంచాయతీ కార్యదర్శి మూర్తి, లోకసాని శ్రీధర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, రాంసింగ్, చంద్రారెడ్డి, నారాయణనాయక్, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

డిండి: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలకేంద్రంలోని సీఎం కప్ క్రీడలను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారులకు క్రీడలపై ఆసక్తి ఉన్నా తగు ప్రోత్సాహం, వనరులు లేక వెనకబడుతున్నారని తెలిపారు. వారిని ప్రోత్సహించేందుకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. క్రీడలు శారీరక దారుఢ్యాన్ని ఇవ్వడంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. డిండి మండల కేంద్రంలో మినీస్టేడియం ఏర్పాటుకు ప్రయత్నిస్తానని అన్నారు. డిండి జడ్పీ హైస్కూల్‌లో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవన నిర్మాణంతో పాటు అదనపు గదుల నిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. డిండి ప్రాథమిక వైద్యశాలను 50 పడకల స్థాయికి పెంచడంతో పాటు చెర్కుపల్లిలో ప్రాథమిక వైద్యశాలను ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. దేవరకొండ - డిండి ప్రధాన రహదారి నుంచి రాసియాతండా బీటీ రోడ్డు నిర్మాణ పనులు, కాల్యతండాలో వాటర్‌ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అంబటి ఆంజనేయులు, ఎంపీడీవో వెంకన్న, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు, నాయకులు టి.నాగార్జునరెడ్డి, ఎన్.రాజేష్‌రెడ్డి, వెంకటరమణ, రాంకిరణ్, బద్దెల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, నూకం వెంకటేష్, బాదమోని శ్రీనివాస్‌గౌడ్, పోలం లక్ష్మణ్, శైలేజ్, గడ్డమీది సాయి, పోషాలు, వావిళ్ల నల్లయ్య, ఆనంద్‌రెడ్డి, లోక్యానాయక్, లక్‌పతినాయక్, వెంకటేష్, ఎం.ఎ.కలీం, రేక్యానాయక్ పాల్గొన్నారు.



క్రీడాపోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

ఆర్పీలకు రూ.18 వేల వేతనం ఇవ్వాలి

నాగార్జునసాగర్, హాలియా, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మెప్మా ఆర్పీలకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని నందికొండ మునిసిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న ఆర్పీలు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించే సమ్మెకు వెళ్తున్న ఆర్పీలను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆర్పీలు మాట్లాడుతూ ఎనిమిది నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ఆర్పీలు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా ఎన్నికల విధులు, సర్వేలు, కుటుంబ, సమగ్ర సర్వేవంటి తదితర ప్రభుత్వ సర్వేల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. మాకు నెలకు రూ.6వేలు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. కనీస వేతనం రూ.18 వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

● నాగార్జునసాగర్‌లో అరెస్టు అయిన వారిలో ఆర్పీలు అనంతలక్ష్మి, వరలక్ష్మి, రేణుక, రమణమ్మ, సింధు, లావణ్య, విశాలక్ష్మి ఉన్నారు. హాలియాలో జి.సుధామయి, జి.ప్రమీల, బి.విజయ, శ్రీహరి, కె.రమణ, ఆర్.నాగమణి, పి.అస్సు, ఆర్. రేణుక, బి.సుజాత, ఎన్.పద్మ, బి.శ్రీవాణి, ధనలక్ష్మి, సుశీల, పి.రోజారాణి తదితరులను పోలీసులు అరెస్ట్ చేశారు.



సాగర్ పోలీస్‌స్టేషన్‌లో ఆర్పీలు

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

తిరుమలగిరి(సాగర్), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ ఎంసీ. కోటిరెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని శ్రీనివాస ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎంఆర్ఎఫ్‌ను పేదలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం వివిధ మండలాలకు చెందిన 36 మంది లబ్ధిదారులకు రూ.9.73 లక్షల విలువైన గల చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. సీఎంఆర్ఎఫ్‌ను పేదలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం మండలంలోని జానారెడ్డి కాలనీలో నిర్వహించిన అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు కేవీ.రామారావు, ఎక్కలూరి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ అంగోతు సూర్యభాష్యనాయక్, సీనియర్ నాయకులు అల్లి పెద్దిరాజు, బీవీ. రమణరాజు, నాగెండ్ల వెంకట్‌రెడ్డి, చవ్వా నాసర్‌రెడ్డి, కోట్యానాయక్, కృష్ణారెడ్డి, అంజయ్య, ముత్తయ్య, శంకర్, బిచ్యానాయక్, రంగసాయి, దేవునాయక్, అంజియాదవ్, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

(5వపేజీ తరువాయి)

సరఫరా ఉండేలా ట్రాన్స్‌కో ఎస్ఈని ఆదేశించాం. అదేవిధంగా ప్రతీ కేంద్రం వద్ద ఆరోగ్యసిబ్బందితో పాటు, అత్యవసరవైద్యానికి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వోకు సూచించాం. ఈ రెండు రోజుల పాటు అభ్యర్థులకు ఇబ్బందుల్లేకుండా ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నాం.

● ఈనెల 15, 16 తేదీల్లో రోజూ రెండు సెషన్లుగా పరీక్షలు జరుగుతాయి. ఉదయం 10నుంచి 12.30గంటల వరకు ఒకటి, మధ్యాహ్నం 3నుంచి 5.30గంటల వరకు రెండో సెషన్ పరీక్షలు జరుగుతాయి.

● ప్రతీ అభ్యర్థి ముందురోజే పరీక్షా కేంద్రాన్ని సరిచూసుకోవాలి. పరీక్షల రోజు ఉదయం 8.30గంటల నుంచే అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతిస్తారు. ప్రతీ అభ్యర్థి బయోమెట్రిక్ హాజరును 9గంటల నుంచి తీసుకుంటారు. అందుకే అభ్యర్థులంతా 8.30గంటల లోపే కేంద్రాల వద్దకు చేరుకోవాలి. మధ్యాహ్నం సైతం గంటన్నర ముందుగానే కేంద్రానికి చేరుకుంటే ప్రశాంతంగా పరీక్ష రాయవచ్చు. చివరి నిమిషం వరకు వేచి ఉండి హడావిడి పడకుండా ముందుగానే కేంద్రాల వద్దకు చేరుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలి. అభ్యర్థులు చెప్పులు మాత్రమే ధరించి రావాలి. షూ వేసుకోకూడదు.

● అభ్యర్థులెవరూ ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, కాలిక్యులేటర్లు, ఎలక్ట్రానిక్ గడియారాలు, సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు, రికార్డింగ్ సాధనాల వంటి పరికరాలేవీ పరీక్షా కేంద్రంలోకి తీసుకురాకూడదు. పరీక్షా కేంద్రాల వద్ద మెటల్‌డిటెక్టర్ ద్వారా పరీక్షించిన తర్వాతే అభ్యర్థులను లోనికి అనుమతిస్తారు. సీసీ కెమెరా పర్యవేక్షణ ఉంటుంది. నలుపు, నీలం బాల్ పాయింట్ పెన్నులు, ఫొటో అతికించిన హాల్‌టికెట్, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా చెల్లుబాటయ్యే ఒరిజినల్ గుర్తింపుకార్డు మాత్రమే పరీక్ష హాల్‌లోకి అనుమతిస్తారు. హాల్ టిక్కెట్‌పై అభ్యర్థిపై ఫొటో, సంతకం స్పష్టంగా కనిపించేలా ఉంటేనే హాల్‌టిక్కెట్‌ని అనుమతిస్తారు. లేజర్‌ప్రింటర్, ఏ 4 సైజ్ కాగితంపై ముద్రించిన హాల్‌టిక్కెట్ తీసుకురావాలి. హాల్‌టిక్కెట్‌లో నిర్దేశిత స్థలంలో ఇటీవలి పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోను అతికించాలి. లేకపోతే హాల్‌టిక్కెట్ తిరస్కరణకు గురవుతుంది.

గతంలోనే మంజూరైన పీహెచ్‌సీ

తిరుమలగిరి(సాగర్), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి(సాగర్) మండలానికి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పీహెచ్‌సీ మంజూరైందని ఆ పార్టీ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కలూరి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ అంగోతు సూర్యభాష్యనాయక్ అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలోని ప్రజలకు వైద్య సేవలను అందించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం సెప్టెంబరు 22, 2023న పీహెచ్‌సీని మంజూరు చేసిందని తెలిపారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ నాయకులు తమ హయాంలోనే పీహెచ్‌సీ మంజూరైనట్లు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగాలను భర్తీ చేయకుండా ఉత్సవాలా?



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

హాలియా, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఏటా రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి మాట తప్పిందని, అయినా ఏడాది ఉత్సవాలను చేయడం విడ్డూరమని డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లం మహేష్ అన్నారు. హాలియాలో శుక్రవారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటి వరకు పదివేల లోపు ఉద్యోగాలు మాత్రమే ఇచ్చిందన్నారు. గత నోటిఫికేషన్ భర్తీ చేసింది, జాబ్ క్యాలెండర్ ప్రకటించింది కానీ దాని ప్రకారం ఉద్యోగాల భర్తీ జరగడం లేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వం ఉత్సవాలు ఆపి ఉద్యోగాలను భర్తీ చేయడంపై దృష్టి పెట్టాలన్నారు. వెంటనే ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నింటినీ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు మూరుగుండ్ల ప్రశాంత్, ప్రణవునాథ్, సుదర్శన్, హరీష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మానవ సంబంధాలతోనే మార్పు సాధ్యం

● రచయిత, విరసం నాయకుడు అల్లం రాజయ్య



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ నారాయణ

మిర్యాలగూడ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మానవ సంబంధాలతోనే మార్పు సాధ్యమవుతుందని రచయిత, విరసం నాయకుడు అల్లం రాజయ్య అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన అల్లం కిరణ్ వర్ధంతి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కిరణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కిరణ్ ఎదుగుతున్న కొద్ది విలువలు నేర్పే కొత్త చదువులు చదవడం నేర్చుకున్నారని కొనియాడారు. గ్రామాల్లోని ఉత్పత్తి విధానం, సామాజిక కుటుంబాల ఆర్థిక విధానంపై లోతుగా అధ్యయనం చేసినట్లు తెలిపారు. ఆయన శాస్త్రీయ పరిశోధనలతో దీర్ఘకాలిక వ్యాధులకు తక్కువ ధరకే మందులు లభించేలా పరిశోధనలు చేశారని గుర్తు చేశారు. ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ అల్లం కిరణ్ ఆశయం గొప్పదని అన్నారు. ఆపరేషన్ లేకుండా బ్రెయిన్ ట్యూమర్‌కు ఔషధాన్ని కనుగొని దానికి పేటెంట్ సాధించి స్వదేశంలో తయారు చేసి తక్కువ ధరకే రోగులకు అందించాలన్న ఆలోచనతో కిరణ్ అమెరికా వెళ్లినట్లు తెలిపారు. ఆర్గానిక్ కెమిస్ట్రీ పీహెచ్‌డీ విద్యార్థిగా కొనసాగుతున్న కిరణ్ 2007 డిసెంబరు 13వ తేదీన అమెరికా తుపాకీ సంస్కృతికి బలైనట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సైన్స్ టాలెంట్ టెస్ట్, వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు నారాయణ బహుమతులు, పతకాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, మట్టి మనుషుల వేదిక కన్వీనర్ వేనేపల్లి పాండురంగారావు, కృష్ణమూర్తి, సమూహ రైటర్స్ ఫోరం నాయకుడు కస్తూరి ప్రభాకర్, కవి మోహన్‌రుషి, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు శ్యామ్ సుందర్‌రెడ్డి, అల్లం కిరణ్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కేతనపల్లి శ్రీనివాసరెడ్డి, ఉదయ, జన విజ్ఞాన వేదిక నాయకులు కొండల్‌రెడ్డి, కందుకూరి సుదర్శన్‌రెడ్డి, పాఠశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.